మా కలం - సామాన్యుడి బలం
స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



Dr. DAMA VIJAYKUMAR B.A., LLB
EDITOR
SWARNA SAGARAM TELUGU DAILY

AP State General Secretary
MALAMAHANADU
AP State Joint Secretary
National Consumer Right Commission
Founder & Chairman
Swarna Sagaram Foundation
9440352036
9666038944
vkdvijay09@gmail.com

మా కలం - సామాన్యుడి బలం
# స్వర్ణసాగరం
www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 06 | పేజీలు : 43 | ఎడిటర్ : డా.దామా విజయ్ కుమార్ | శుక్రవారం 14 ఫిబ్రవరి 2025 | వెల : 2-00

## పర్యాటకంలో అవకాశాలు
# అపారం
## పర్యాటకాభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ సిద్ధం చేయండి

- పెట్టుబడులకు ఇదే సరైన సమయం
- పురాతన కోటలకు సరికొత్త శోభ
- తిరుపతి, విశాఖ, అమరావతి, శ్రీశైలం, రాజమహేంద్రవరంలో టూరిజం హబ్స్ ఏర్పాటు
- సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు



**స్వర్ణసాగరం అమరావతి**

రాబోయే ఐదేళ్లలో రాష్ట్రాన్ని పర్యాటకాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబునాయుడు సూచించినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం వెలగపూడి సచివాలయంలోని మొదటి బ్లాక్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన పర్యాటక రంగ సమీక్షా సమావేశానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తో పాటు ఉన్నతాధికారులు, అధికారులు హాజరయ్యారు. పర్యాటక రంగ అభివృద్ధికి శాఖ తరపున విస్తృత ప్రచారం కల్పించి రానున్న ఐదేళ్లలో 20 శాతం వృద్ధి రేటు సాధించే దిశగా, భారీ సంఖ్యలో యువతకు ఉపాధి కల్పించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు సూచనలు చేశారని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. పర్యాటకం అంటే కేవలం ఆదాయ వనరే కాదని రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే ప్రధాన వేదిక అని మంత్రి కందుల దుర్గేష్ ఈ సందర్భంగా అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించిన అన్ని సూచనలను త్వరలోనే ఆచరణలో పెడతామని, సరికొత్త ఆంధ్రప్రదేశ్ కు బాటలు వేస్తామని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించిన పలు అంశాలను, సూచనలను, నిర్ణయాలను మంత్రి కందుల దుర్గేష్ వివరిస్తూ ఏమన్నారంటే... తిరుపతి, విశాఖ, అమరావతి, శ్రీశైలం, రాజమహేంద్రవరంలో టూరిజం హబ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. శ్రీశైలంను మెగా ప్రాజెక్టుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించి స్థానికంగా ఉన్న సమూహాలను భాగస్వామ్యులుగా చేసి సమీపంలోని డ్యామ్, అటవీ ప్రాంతం, టైగర్ సఫారి లను కలుపుతూ సర్క్యూట్ గా అభివృద్ధి చేయాలని సీఎం సూచించినట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా బీచ్ టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కన్సల్టెంట్ లను నియమించుకోవాలని సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన హోటల్స్, శుభ్రంగా ఉండేలా నిర్వహణ, మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో, దేశాల్లో సైతం ఇన్వెస్టర్స్ సమ్మిట్ లు నిర్వహించాలని సీఎం తెలిపినట్లు మంత్రి వివరించారు. - మిగతా3లో



## నీటి ప్రాజెక్టులు
# గడువులోగా పూర్తవ్వాలి

- లేదంటే కాంట్రాక్టు సంస్థలు, అధికారులే బాధ్యులు: సీఎం
- 2027 చివరికి పోలవరం పూర్తికావాలి
- పనులపై నిరంతరం సమీక్షించుకోవాలి
- ప్రాజెక్టు ఫలితాలు వచ్చేలోగా
- ఉత్తరాంధ్రకు సుజల స్రవంతి ఫలాలు!
- వెలిగొండ 30 ఏళ్లుగా పూర్తికాకపోవడం బాధాకరం
- భూగర్భజలాలపై మంత్రులతో కమిటీ
- 'బనకచర్ల'కు ప్రత్యేక కార్పొరేషన్: బాబు
- మూడు దశల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం
- 2026 నాటికి హంద్రీ-నీవా తొలిదశ
- మే నెలకల్లా పుంగనూరు, కుప్పం బ్రాంచి కెనాల్ పూర్తి
- జలవనరుల శాఖ కార్యాచరణ

# వంశీ అరెస్ట్

- బెదిరింపులు, కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ
- కేసు హైదరాబాద్‌లో అరెస్టు..
- విజయవాడకు తరలింపు
- టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మరో మలుపు
- కేసు వాపసు కోసం ఫిర్యాదుదారుకు బెదిరింపులు
- రాజీకి రాకపోతే నా తమ్ముడిని చంపేస్తామన్నారు
- నన్ను, నా తల్లిదండ్రులనూ హెచ్చరించారు
- కోర్టులో నా తమ్ముడితో బలవంతపు వాంగ్మూలం
- కిడ్నాప్ చేశారని సత్యవర్ధన్ సోదరుడి ఫిర్యాదు
- వంశీ ఏ1గా రెండు కేసులు నమోదు
- కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో సుదీర్ఘ విచారణ
- అన్ని ప్రశ్నలకూ 'తెలియదు' అనే సమాధానం
- వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరు



**స్వర్ణసాగరం విజయవాడ**

"వల్లభనేని వంశీ నొటోరియస్ క్రిమినల్. ఆయన కు చాలా నేర చరిత్ర ఉంది. చట్టం, న్యాయం అంటే లెక్కే లేదు. ఆయనపై 16 క్రిమినల్ కేసులు ఉన్నాయి".. అని పోలీసులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. - మిగతా3లో



## సరిహద్దుల్లో మరోసారి
## రెచ్చిపోయిన పాక్ సైన్యం

- తగిన శాస్తి చేసిన భారత్..
- ఎల్ ఓసి వద్ద బుధవారం సాయంత్రం పాకిస్తాన్ సైన్యం కాల్పుల విరమణ ఉల్లంఘన
- రౌండ్లు కాల్పులు జరుపుతూ కవ్వింపు చర్యలకు పాల్పడటంతో.. అందుకు ధీటుగా బదులిచ్చిన భారత బలగాలు
- మన దేశ సైన్యం శత్రువుల కాల్పులను సమర్థంగా తిప్పికొట్టంతో కాల్పులు ఆపిన దాయాది సైన్యం

# రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ

- 1.40 లక్షల కోళ్లు కాల్చేసేందుకు చర్యలు
- ఎలాంటి ఆందోళన వద్దు
- రేపు రాష్ట్రానికి రానున్న కేంద్ర ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీ
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- అలా చేసి చికెన్, గుడ్లు తినొచ్చు.. భయపడాల్సిన పనిలేదు
- ఏపీలో అంతకంతకూ విస్తరిస్తోన్న బర్డ్ ఫ్లూ వైరస్
- ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 50లక్షలకు పైగా కోళ్లు మృతి
- ఏపీలో భారీగా పడిపోయిన చికెన్ ధరలు




**స్వర్ణసాగరం అమరావతి**

ఏపీలో బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాల్లో దీని తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఈ వైరస్ కారణంగా ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 50లక్షలకు పైగా కోళ్లు మృతిచెందినట్లు సమాచారం. బర్డ్ ఫ్లూపై సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం, అధికారుల హెచ్చరికల నేపథ్యంలో ఏపీలో చికెన్ ధరలు భారీగా పడిపోయాయి. అటు కస్టమర్లు రాకపోవడంతో చికెన్ సెంటర్లు బోసి పోతున్నాయి. ఈ క్రమంలో తాజాగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు బర్డ్ ఫ్లూపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రకటించారు. ఉడికించిన చికెన్, గుడ్లు తింటే ప్రమాదం ఏమీలేదని ఆయన స్పష్టం చేశారు. బర్డ్ ఫ్లూపై సోషల్ మీడియా, కొన్ని పత్రికలు భయాందోళనలు సృష్టిస్తున్నాయని, అలాంటి వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్రం, శాస్త్రవేత్తలతో చర్చించామని చెప్పిన మంత్రి.. కోళ్లకు వ్యాధి సోకిన ప్రాంతానికి ఒక కిలోమీటర్ వరకే ఇది పరిమితం అవుతుందని - మిగతా3లో

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన

- రాష్ట్రపతి పాలన విధిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ
- ఇటీవల సీఎం పదవికి బీరెన్‌సింగ్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.
- మణిపూర్ అల్లర్లు రెండు జాతుల మధ్య రేగిన వైరం..
- యావత్ ప్రపంచం దృష్టి నిలిపేలా హింసకు మూల కారణమైన కుకీ, మైతేయ్ తెగల మధ్య వైరం



# సరిహద్దుల్లో మరోసారి రెచ్చిపోయిన పాక్ సైన్యం



నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వద్ద పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలోని నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వద్ద బుధవారం సాయంత్రం పాకిస్తాన్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘించింది. పాకిస్తాన్ సైన్యం వరసగా అనేక రౌండ్ల కాల్పులు జరుపుతూ కవ్వింపు చర్యలకు పాల్పడటంతో.. భారత బలగాలు కూడా అందుకు ధీటుగా బదులిచ్చాయి. మన దేశ సైన్యం శత్రువుల కాల్పులను సమర్థంగా తిప్పికొట్టంతో దాయాది సైన్యం నుంచి కాల్పులు ఆగిపోయాయి. శత్రుసైన్యం తోకముడుచుకుని పారిపోయింది.

**సరిహద్దుల్లో నిఘా కఠినతరం..**

ఫిబ్రవరి 25, 2021న భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధరించినప్పటి నుంచి సరిహద్దుల్లో దాడులు తగ్గాయి. ఈ సంవత్సరంలో దాయాది సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘించడం ఇదే తొలిసారి. ఈ ఘటన తర్వాత సరిహద్దుల్లో నియంత్రణ రేఖ వద్ద ఉద్రిక్తత పెరిగింది. భారత సైన్యం కూడా నిఘాను కఠినతరం చేసింది. శత్రు సైన్యానికి తగిన బుద్ధి చెప్పేందుకు వీలుగా సరిహద్దులో భద్రతా ఏర్పాట్లను సైన్యం బలోపేతం చేస్తోంది.

**పాక్ సేనకు భారీ ప్రాణ నష్టం..**

భారత సైనికులను లక్ష్యంగా చేసుకోవడానికి ఉగ్రవాదులు ముళ్ల తీగల కంచె దగ్గర ఐఈడీని అమర్చారని వర్గాలు తెలిపాయి. పూంచ్ సెక్టార్‌లోని ఎల్‌ఓసీ వద్ద జరిగిన ల్యాండ్‌మైన్ పేలుడులో ఒక సైనికుడు గాయపడ్డాడని వర్గాలు తెలిపాయి. తాజాగా పాక్ బలగాలకు దుశ్చర్యకు ప్రతిగా భారత సైన్యం బదులిచ్చి దాయాది సైన్యానికి భారీ నష్టం కలిగించి చెమటలు పట్టించింది. అంతేకాదు.. శత్రుసైన్యం వైపు పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోనట్లు వార్తలు వస్తున్నాయి.

**వారంలోనే పలుమార్లు దాడి..**

గత వారం రోజుల్లో పాకిస్తాన్ వైపు నుంచి ఇలాంటి సంఘటనలు చాలా వెలుగులోకి వచ్చాయి. ఫిబ్రవరి 8న, రాజౌరిలో ఎల్‌ఓసీ వద్ద గస్తీ తిరుగుతున్న సైనికులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపగా భారత సైనికులు తగిన బుద్ధి చెప్పారు. ఇంకా రాజౌరిలోని నౌషెరా సెక్టార్‌లో స్నిపర్ కాల్పులు జరపడంతో ఒక ఆర్మీ సైనికుడు గాయపడ్డాడు. బుధవారం ఫిబ్రవరి 12న జమ్మూలోని అఖ్నూర్ ఎల్‌ఓసీ సమీపంలో ఉగ్రవాదులు ఐఈడీని అమర్చి పేల్చారు. ఈ దాడిలో ఒక భారత కెప్టెన్ సహా ఇద్దరు సైనికులు అమరులయ్యారు. ఒక సైనికుడు గాయపడ్డాడు. ఒక పక్క పాకీ ఆర్మీ వరస దాడులు చేస్తుంటే.. మరో పక్క ఉగ్రవాదులు చొరబాటు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో పాకిస్థన్ కుట్రలను నిలువరించేందుకు భారతసైనికులు నిఘా కఠినతరం చేశారు.

## తమిళనాడుకు చేరిన
# పవన్ ఆధ్యాత్మిక యాత్ర

- తంజావూరు, కుంభకోణం ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- కందషష్టి కవచ పారాయణంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం
- ఆలయాల్లో రాజకీయాలు వద్దు ప్లీజ్..
- మీడియాకు జనసేన అధినేత వినతి



**చెన్నై, అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ గురువారం తమిళనాడులోని తంజావూరు చుట్టుపక్కలున్న వివిధ ఆలయాలను సందర్శించారు. బుధవారం కేరళలోని ఆలయాలను సందర్శించిన పవన్.. గురువారం తొలుత ఓంకార మంత్ర రహస్యాన్ని సృష్టికి అందించిన క్షేత్రంగా, షష్ఠ షణ్ముఖ క్షేత్రాల్లో ఐదవదిగా పేరుగాంచిన తంజావూరు జిల్లా స్వామిమలైలో కొలువైన స్వామినాథ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. పవన్ పంచహారతులతో హారతి ఇచ్చి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ధ్వజస్తంభానికి మొక్కారు. స్వామినాథస్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన కంద షష్ఠి కవచ పారాయణంలో పాల్గొన్నారు. తరువాత ఆ ఆలయంలో వెలసిన ఆదిదంపతులు సుందరేశ్వరన్ స్వామి, మీనాక్షి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్‌కు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఉమాదేవి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తంజావూరు జిల్లా కుంభకోణంలో వున్న శ్రీ ఆది కుంభేశ్వరాలయాన్ని పవన్ సందర్శించారు. ఆలయ సంప్రదాయం మేరకు మొదట ఆది వినాయగర్‌ని పూజించారు. అనంతరం శ్రీ ఆదికుంభేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమృతభాండాకారంలో వున్న శివలింగ విశిష్ఠతను ఆలయ అర్చకులు వివరించారు. అమృతం, ఇసుకతో కలగలసి ఉద్భవించిన ఈ లింగానికి అభిషేకాలు నిర్వహించరని తెలిసి, విశిష్ఠ పూజలు నిర్వహించారు. పంచహారతులు ఇచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదికుంభేశ్వరాలయంలో స్వామివారికి ఎడమవైపు వెలసిన పార్వతీదేవి అవతారం శ్రీ మంగనాయకి అమ్మవారికి కూడా పవన్ పూజలు నిర్వహించారు. అనంతరం ఇదే ఆలయ ప్రాంగణంలో వున్న అగస్త్య ధ్యాన పీఠాన్ని సందర్శించారు. ఈ ప్రాంతంలో కూర్చుంటే తెలియకుండానే ధ్యాన ముద్రలోకి వెళ్తారని మందిరం విశిష్ఠతను అర్చకులు ఈ సందర్భంగా వివరించారు. అంతకు ముందు ఆలయ ఆస్థాన గజం మంగళంతో కలిసి అర్చకులు, అధికారులు, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలికారు. ఆలయ ఆస్థాన ఏనుగుకు పవన్ అరటి పళ్లు అందించి ఆశీస్సులు పొందారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మురుగన్, ట్రస్టు బోర్డు సభ్యులు బాల సుబ్రహ్మణ్యం, శంకరరాణి, చిదంబరం తదితరులు పవన్‌కు స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందించి సత్కరించారు.

**ఆలయాల్లో రాజకీయాలు వద్దు ప్లీజ్!**

శ్రీ ఆదికుంభేశ్వరాలయ సందర్శనానంతరం పవన్ మీడియాతో మాట్లాడుతూ... 'నాలుగేళ్లుగా శ్రీ అగస్త్య మహాముని ఆలయం, స్వామిమలై శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్ర దర్శనం కోసం వేచిచూస్తున్నా. ఇప్పటికి ఆ మురుగన్ అనుగ్రహం లభించింది' అని అన్నారు. తమిళనాడులో విజయ్ రాజకీయ ప్రస్థానం గురించి ప్రస్తావించగా... ఆలయాల్లో రాజకీయాలు వద్దంటూ సున్నితంగా తిరస్కరించారు. కాగా కుంభకోణం వచ్చిన పవన్‌కు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. తెలుగు విద్యార్థులు, అభిమానులతో పవన్ సెల్ఫీలు దిగారు. అదేవిధంగా ఓ దుకాణంలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన 'కుంభకోణం డిక్రీ' కాఫీని పవన్ రుచి చూశారు. పవన్ వెంట ఆయన కుమారుడు అకిరా నందన్, టీటీడీ ట్రస్టు బోర్డు సభ్యుడు ఆనంద్ సాయి కూడా వున్నారు. ఇదిలా వుండగా శుక్రవారం పవన్ కల్యాణ్ తూత్తుకుడి జిల్లా తిరుచ్చెందూర్, మదురై మీనాక్షి, పళని మురుగన్, తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలను కూడా సందర్శించనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

# కమల్ హాసన్‌తో డీసీఎం భేటీ!



చెన్నై : మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు, ప్రముఖ నటుడు కమల్ హాసన్‌కు రాజ్యసభ సీటు దాదాపూ ఖరారైనట్లే తెలుస్తోంది. అందుకు ఊతం ఇచ్చేలా తమిళనాడు అధికార పార్టీ డీఎంకే నేత, డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ గురువారం కమలహాసన్‌తో భేటీ అయ్యారు. తమిళనాడులో అధికార పార్టీ డీఎంకే కమల్ హాసన్‌ను రాజ్యసభకు నామినేట్ చేయనుందంటూ స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. బుధవారం కమల్ హాసన్ నివాసానికి రాష్ట్రమంత్రి పీకే శేఖర్ బాబు వెళ్లారు. ఆ భేటీని ఎంఎన్‌ఎం పార్టీ ఎక్స్ వేదికగా ప్రస్తావించింది. దీంతో రాజ్యసభకు కమల్ హాసన్ ప్రచారం జోరందుకుంది. ఈ తరుణంలో కమల్ హాసన్‌తో ఉదయనిధి స్టాలిన్ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. కమల్‌తో భేటీ అనంతరం, ఉదయనిధి స్టాలిన్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'మేం ఈరోజు మక్కల్ నీది మయ్యం నాయకుడు కమల్ హాసన్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశాం. మమ్మల్ని హృదయపూర్వకంగా స్వాగతించినందుకు, రాజకీయాలు, సినిమాతో పాటు వివిధ రంగాలపై అభిప్రాయాలను పంచుకున్నందుకు నా కృతజ్ఞతలు'అని ట్వీట్‌లో పేర్కొన్నారు. 2024లో తమ ఎన్నికల ఒప్పందంలో భాగంగా హాసన్‌కు రాజ్యసభ సీటు ఇస్తామని డీఎంకే హామీ ఇచ్చినట్లు సమాచారం. మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయలేదు. కానీ తమిళనాడులో డీఎంకే నేతృత్వంలోని ఇండియా కూటమికి మద్దతు ఇచ్చింది. గతేడాది మార్చిలో కమల్ హాసన్ డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంను సందర్శించారు. అక్కడ డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో ఒప్పందంపై సంతకం చేశారు. డీఎంకే నేతృత్వంలోని కూటమితో పొత్తు పెట్టుకోవాలనే తన నిర్ణయం వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కంటే జాతీయ ప్రయోజనాల దృష్ట్యానే జరిగిందని కమల్ హాసన్ స్పష్టం చేశారు. 'నేను ఈ ఎన్నికల్లో పోటీ చేయబోవడం లేదు. కానీ ఈ ఇండియా కూటమికి మా పూర్తి మద్దతు ఉంటుంది. ఎందుకంటే ఇది ఒక పదవి కోసం కాదు, దేశం కోసం'అని ఆ సమయంలో వ్యాఖ్యానించారు. ఒప్పందం ప్రకారం, తమిళనాడు, పుదుచ్చేరిలో డీఎంకే నేతృత్వంలోని కూటమి తరపున లోక్‌సభ ఎన్నికలకు కమల్ హాసన్ ప్రచారం చేశారు. ప్రతిగా 2025లో డీఎంకే కోటా నుండి రాజ్యసభ నామినేట్ చేయనుంది. డీఎంకే, ఏఐఏడీఎంకే, పీఎంకే సభ్యులతో సహా కనీసం ఆరుగురు రాజ్యసభ ఎంపీల పదవీకాలం జూన్ 2025 నాటికి ముగియనుంది. అందుకే డీఎంకే పార్టీ ఇప్పుడు కమల్ హాసన్‌ను రాజ్యసభకు నామినేట్ చేసేందుకు సిద్ధమైంది.

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన



మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల సీఎం పదవికి బీరెన్‌సింగ్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. గత రెండేళ్లుగా తీవ్ర అశాంతి నెలకొన్న బీజేపీ పాలిత మణిపూర్‌లో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఆదివారం రాజీనామా చేయడంతో రాజకీయంగా అనిశ్చితి ఏర్పడింది. మణిపూర్ అల్లర్లు రెండు జాతుల మధ్య రేగిన వైరం.. ఎంతటి హింసకు దారి తీసిందో అంతా చూశాం. ఇప్పటికీ ఇదే విషయంలో మణిపూర్ రగులుతూనే ఉంది. ఈ హింసకు మూల కారణమైన కుకీ, మైతేయ్ తెగల మధ్య వైరం ఇప్పుడు యావత్ ప్రపంచం దృష్టి నిలిపేలా చేసింది. అయితే, ఈ అల్లర్ల వెనుక సీఎం బీరేన్ సింగ్ ఉన్నారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఎట్టకేలకు మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. దాదాపు రెండేళ్లనాడు హత్యలూ, అత్యాచారాలూ, గృహదహనాలతో అట్టుడికి ప్రపంచవ్యాప్తంగా మన దేశ పరువు ప్రతిష్ఠలను మంటగలిపిన ఆ రాష్ట్రం 649 రోజులైనా ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. 2023 మే 3న రాష్ట్రంలో ప్రధాన తెగలైన మెయితీలకూ, కుకీలకూ మధ్య రాజుకున్న ఘర్షణలు చూస్తుండ గానే కార్చిచ్చులా వ్యాపించగా అధికారిక లెక్కల ప్రకారమే 260 మంది ప్రాణాలు కోల్పోయారు. 60,000 మంది ఇప్పటికీ తమ స్వస్థలాలకు వెళ్లలేక సహాయ శిబిరాల్లో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. భద్రతా బలగాల పహారా కొనసాగుతున్నా మెయితీలు, కుకీలు ఒకరి ప్రాబల్య ప్రాంతాల్లోకి మరొకరు ప్రవేశించే సాహసం చేయటం లేదు. అందువల్ల నిరుపేదల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింది. మణిపూర్ హింసాకాండ సాధారణమైనది కాదు. అనేకచోట్ల మహిళలను వివస్త్రలను చేసి, వారిపై అత్యాచారాలకు పాల్పడిన ఉదంతాలు దిగ్భ్రాంతికి గురిచేశాయి.

## అమెరికాలో కోడిగుడ్ల తీవ్ర కొరత..
## మూడింతలు పెరిగిన ధర


**గత ఏడాది జనవరిలో 2.52 డాలర్లుగా ఉండగా 7.34 డాలర్లకు పెరిగిన ధర**

**చాలా స్టోర్లలో లిమిటెడ్ స్టాక్, నో స్టాక్ బోర్డుల దర్శనం**

**బర్డ్ ఫ్లూ వ్యాప్తి నేపథ్యంలో గత డిసెంబర్‌లో 2.3 కోట్ల కోళ్లను వధించిన అమెరికా**

అమెరికాలో కోడిగుడ్ల కొరత తీవ్రంగా ఉండటంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ధరలు 15 శాతం పెరిగాయని, రానున్న రోజుల్లో మరో 20 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కోడిగుడ్ల కొరత కారణంగా చాలా స్టోర్లలో 'లిమిటెడ్ స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. కొన్ని స్టోర్లలో అయితే, 'నో స్టాక్' బోర్డులు కూడా కనిపిస్తున్నాయి. కొనుగోలుదారులకు ఒక్కొక్కరికి రెండు లేదా మూడు కోడిగుడ్ల ట్రేలను మాత్రమే విక్రయిస్తున్నారు. అమెరికా వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం, బర్డ్ ఫ్లూ వ్యాప్తి కారణంగా గత ఏడాది డిసెంబర్ నెలలో సుమారు 2.3 కోట్ల కోళ్లను వధించారు. గత ఏడాది జనవరిలో ఒక కోడిగుడ్డు ధర 2.52 డాలర్లు ఉండగా, డిసెంబర్ నాటికి అది 4.15 డాలర్లకు పెరిగింది. ప్రస్తుతం ఆ ధర 7.34 డాలర్లకు చేరుకుందని అమెరికా లేబర్ బ్యూరో లెక్కలు చెబుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కోడిగుడ్ల ధర 45 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరుకుందని సమాచారం. గుడ్ల ఉత్పత్తి తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయి. దీంతో వినియోగదారులు ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ కారణంగానే స్టోర్లలో 'నో స్టాక్' లేదా 'లిమిటెడ్ స్టాక్' బోర్డులు కనిపిస్తున్నాయి. కోడిగుడ్ల కొరత, ధరల పెరుగుదల హొటల్స్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. చాలా రెస్టారెంట్లు గుడ్డుతో చేసే వంటకాలపై 50 శాతం అదనపు ఛార్జీని విధిస్తున్నాయి

## కుంభమేళకు హెలికాప్టర్ సేవలు



**లక్నో :** మహాకుంభమేళా ఈ సారి కనీవినీ ఎరుగని రీతిలో జరుగుతోంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు కోట్ల సంఖ్యలో వెళు్న్నారు. ఇప్పటికే దాదాపు 42 కోట్ల మంది కుంభమేళాలో పాల్గొని.. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు సమాచారం. అయితే.. దేశవిదేశాల నుంచి భక్తులు కుంభమేళాలో పాల్గొనేందుకు వస్తుండటంతో.. ఉత్తరప్రదేశ్‌కు వెళ్లే దారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. కొన్ని చోట్ల అయితే.. వంద కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ముందుకు వెళ్లే పరిస్థితి లేదని.. దాదాపు 300 కిలో మీటర్లు ట్రాఫిక్ జామ్ అవ్వడంతో.. చాలా మందిని వెనక్కి వెళ్లిపోవాల్సిందిగా భక్తులకు పోలీసులు సూచినలు చేస్తున్న వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అంత భారీ ఎత్తున్న భక్తులు కుంభమేళా కోసం వెళ్తున్నారు.చాలా మంది మార్గమధ్యలోనే ట్రాఫిక్‌లో గంటల తరబడి ఇరుక్కుపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సరికొత్త ఆలోచనతో ముందుకు వచ్చింది. ప్రయాగ్‌రాజ్ ఏయిర్ పోర్టు నుంచి త్రివేణి సంగమం వరకు హెలికాప్టర్ సేవలు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించింది. ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్ ఎకో టూరిజం డెవలప్‌మెంట్ బోర్డు, ఫ్లై ఓలా భాగస్వామ్యంతో ఈ హెలికాప్టర్ సేవలు ప్రారంభించారు. విమానం ద్వారా.. ప్రయాగ్‌రాజ్‌కు చేరుకునే భక్తులు.. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా త్రివేణి సంగమానికి చేరుకోవడానికి వీలు లేకపోవడంతో హెలికాప్టర్ సేవలు ప్రారంభించారు. రోడ్డు మార్గంలో వెళ్తే.. ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ కారణంగా గంటలకు గంటల సమయం పడుతోంది.ప్రయాగ్‌రాజ్ నుంచి నేరుగా త్రివేణి సంగమం వరకు ఏర్పాటు చేసిన ఈ హెలికాప్టర్ సేవలు మాత్రం చాలా ఖర్చుతో కూడుకున్న అంశం. ఎయిర్‌పోర్టులో దిగి 23.7 కిలో మీటర్ల దూరంలో ఉన్న త్రివేణి సంగమానికి హెలికాప్టర్‌లో డైరెక్టుగా వెళ్లాలంటే.. ఒక్కో ప్రయాణికుడు రూ.35 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఇందులోనే హెలికాప్టర్ ఛార్జీ, బోట్ ట్రాన్స్‌పోర్ట్, ఇతర సేవలు కూడా ఇస్తారు. ఈ హెలికాప్టర్ సేవలు ఉపయోగించుకోవాలంటే ముందుగానే ఫ్లై ఓలా వెబ్‌సైట్‌లో టిక్కెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే.. ఈ సేవలు అప్ అండ్ డౌన్ ఉంటాయి. రూ.35 వేలతో టిక్కెట్ బుక్ చేసుకుంటే.. ఎయిర్ పోర్ట్ నుంచి త్రివేణి సంగమానికి తీసుకెళ్లి.. పుణ్యస్నానాలు ఆచరించి, ఇతర కార్యక్రమాలు ముగించుకున్న తర్వాత తిరిగి ఎయిర్ పోర్ట్‌కు తీసుకెళ్తారు.ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానాలు ఆచరించేందుకు పలు ఘాట్లు ఉన్నప్పటికీ భక్తులు ఎక్కువగా త్రివేణి సంగమంలోనే పుణ్యస్నానాలు ఆచరించేందుకు మక్కువ చూపుతున్నారు. అందుకు కారణం ఏంటంటే.. మూడు నదులు(గంగా, యమునా, సరస్వతి) కలిసే ప్రదేశాన్నే త్రివేణి సంగమం అంటారు. హిందూ ధర్మ ఆచారం ప్రకారం సాగర మథనం జరిగిన సమయంలో ఇదే ప్రదేశంలో అమృతం వచ్చినట్లు భక్తులు విశ్వసిస్తారు. ఆ కారణంగానే ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు...

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ

-మొదటిపేజీ తరువాయి

చెప్పినట్లు అచ్చెన్నాయుడు వెల్లడించారు.

బర్డ్ ఫ్లూ పై ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ బర్డ్ ఫ్లూ నియంత్రణకు పటిష్టమైన చర్యలను తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ సమస్య పై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీతో పాటు బోపాల్ లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైసెక్యురిటీ యానిమల్ డిసీజెస్ ల్యాబ్ శాస్త్రవేత్తలతో కూడా చర్చించారన్నారు. కేంద్ర నుండి ఇప్పటికే పలు బృందాలు రాష్ట్రానికి వచ్చాయని, కేంద్ర ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీ కూడా శుక్రవారం రాష్ట్రానికి రానున్నారని ఆయన తెలిపారు.

బర్డ్ ఫ్లూ విషయంలో ప్రజలు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఎటు వంటి భయం లేకుండా బాగా ఉడికించిన గ్రడ్లను, మాంసాన్ని నిరభ్యంతరంగా తినవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో పలు మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు వార్తలు, సమాచారం వల్ల ప్రజలు ఏ మాత్రం ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ప్రజలు బయాందోళనలకు గురయ్యేలా బర్డ్ ఫ్లూ పై తప్పుడు వార్తలు, సమాచారాన్ని వ్యాప్తి చేసేవారి పై కఠిన చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. బర్డ్ ఫ్లూ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలను చేపట్టడం జరిగిందన్నారు. ఏలూరు జిల్లా బాదంపూడి, పశ్చిమగోదావరి జిల్లా వేల్పూరు, కానూరు, కృష్ణా జిల్లా గంపలగూడెం ప్రాంతాల్లోని ఐదు ఫ్రౌల్ట్రీల్లో ఈ వ్యాధి సోకినట్లుగా గుర్తించి ఆయా ప్రాంతాలను బయో సెక్యూరిటీ జోన్లుగా ప్రకటించి, అధికారులను, సిబ్బందిని ఆయా ప్రాంతాలకు పంపించి వ్యాధి వ్యాప్తిని నియంత్రించేం దుకు పటిష్టమైన చర్యలను చేపట్టడం జరిగిందన్నారు. ఈ బర్డ్ ఫ్లూ వ్యాప్తి నియంత్రణకై కేంద్ర ప్రభుత్వం కూడా మార్గదర్శకాలను జారీ చేయడం జరిగిందన్నారు. ఈ మార్గదర్శకాల ప్రకారం వ్యాధి సోకిన ప్రాంతానికి ఒక కిలోమీటరు పరిధిలో రాకపోకలను, దాణా రవాణాను నియంత్రిస్తున్నా మని, ఒక ఫౌల్ట్రీ కూడా లేకుండా చూస్తున్నట్లు ఆయన తెలిపారు. ఒకటి నుండి తొమ్మిది కిలోమీటర్ల పరిధిలో ముందస్తు జాగ్రత్తలను కూడా తీసుకుంటున్నామని మరియు ఈ పరిధికి బయటనున్న ప్రాంతాల్లో ఎటు వంటి ప్రభావం ఉండదని మంత్రి తెలిపారు.



ఇతర ప్రాంతాల్లో ఈ వ్యాధి సోకిన దాఖలాలు ఇప్పటి వరకూ ఏమీ కనిపించలేదని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, పశు సంవర్ధక శాఖ, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారన్నారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ సంచాలకులు డా.టి.దామోదర నాయుడు మాట్లాడుతూ సైబీరియన్ వలస పక్షులు రెట్టల వల్ల రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఈ బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందిందన్నారు. ఆయా ప్రాంతాలను రెడ్ జోన్ లుగా ప్రకటించి వ్యాధి నియంత్రణా చర్యలను తీసుకోవడం జరుగుచున్నదన్నారు. ఇప్పటి వరకూ 14 వేల కోళ్లను కాల్చేయడంతో పాటు 340 గ్రడ్లను నాశనం చేయడం జరిగిందన్నారు. మరో రెండు మూడు ఫౌల్ట్రీలో 1.40 లక్షల కోళ్ల వరకూ ఉన్నాయని, వాటిని కూడా కాల్చేసే చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

# వంశీ అరెస్ట్

-మొదటిపేజీ తరువాయి

"గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనపై సత్యవర్ధన్ ఫిర్యాదు మేరకు వంశీ తదిరులపై కేసు కథ అడ్డం తిరిగింది! ఒక కేసు నుంచి తప్పించుకునేందుకు అతి తెలివితో వేసిన ఎత్తుగడ వికటించింది. మరో తీవ్రమైన కేసులో ఇరుక్కునేలా చేసింది. అరెస్టుదాకా వెళ్లింది. 2023లో గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసును నీరు గార్చేందుకు మాజీ ఎమ్మెల్యే, వివాదాస్పద వైసీపీ నేత వల్లభనేని వంశీ పన్నిన పథకం తిరిగి ఆయన మెడకే చిక్కుకుంది. కిడ్నాప్, బెదిరింపులు, ఎస్సీ, ఎస్టీ కేసులో వంశీని గురువారం ఉదయం విజయవాడ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదు వాపస్ తీసుకునేలా తన సోదరుడు ముదునూరి సత్యవర్ధన్‌ను బెదిరించి, భయపెట్టారని... కిడ్నాప్ కూడా చేశారని కిరణ్ అనే యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీకి చెందిన బీసీ, మైనారిటీ, దళిత నాయకులు రమాదేవి, సురేశ్ బాబు, ఫణికుమార్, షేక్ జానీ ఇదే అంశంపై చేసిన ఫిర్యాదుపై ఇంకో కేసు పెట్టారు. ఈ రెండు కేసుల్లో పోలీసులు వల్లభనేని వంశీని ప్రధాన నిందితుడిగా పేర్కొన్నారు. ఆయన ప్రధాన అనుచరులు కొమ్మా కోట్లు, రామకృష్ణ, నీరజ్ తదితరులను నిందితులుగా చేర్చారు.

**ఇలా అరెస్టు...**

బెదిరింపులు, కిడ్నాప్ కేసులో వంశీ అరెస్టు కోసం అదనపు డీసీపీ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం విజయవాడ నుంచి బుధవారం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లింది. వీరు గురువారం ఉదయం 6.30 గంటలకు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. గచ్చిబౌలి మైహెూం భుజాలో నివసిస్తున్న వల్లభనేని వంశీని అరెస్టు చేయాల్సి ఉందని, తమకు ఎస్కార్ట్ ఇవ్వాలని కోరారు. కేసు వివరాలను వారికి తెలిపారు. దీంతో... రాయదుర్గం ఠాణా నుంచి ఒక ఎస్ఐతోపాటు మరో ఐదుగురు పోలీసులు విజయవాడ పోలీసులకు తోడుగా వచ్చారు. నేరుగా... మైహెూమ్ భూజా డి బ్లాక్‌లో 11వ అంతస్తులో ఉంటున్న వంశీ ఫ్లాట్ వద్దకు చేరుకున్నారు. "సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి బెదిరించారనే ఆరోపణలతో మీపై పటమట పోలీసు స్టేషన్‌లో భారత న్యాయ సంహితలోని సెక్షన్లు 140 (1), 308, 351(3), రెడ్‌విత్3(5)తోపాటు సెక్షన్ 3(2) ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదైంది. క్రైమ్ నంబర్ 86/2025 కేసులో మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాం" అంటూ వంశీకి నోటీసు ఇచ్చారు. దాన్ని చదివిన తర్వాత పోలీసులతో వంశీ కొద్దిసేపు వాదనకు దిగారు. ఆ తర్వాత ఎక్కువ హడావుడి చేయకుండానే పోలీసుల వెంట వచ్చేందుకు అంగీకరించారు. గురువారం ఉదయం 7 గంటలకల్లా వంశీ అరెస్టు ప్రక్రియ ముగిసింది. పటమట పోలీసులు ఉదయం 7.15 గంటలకు వంశీతోపాటు రోడ్డు మార్గంలో విజయవాడకు బయలుదేరారు. మధ్యాహ్నం 12.40 గంటలకు భవానీపురం పోలీసస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ వంశీని మరో వాహనంలోకి మార్చారు. ఆయనను పటమట పోలీసస్టేషన్‌కు తరలిస్తారని కొంతసేపు, కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు తీసుకెళ్తారని మరికొంతసేపు ప్రచారం జరిగింది. అయితే.. ఎవరూ ఊహించనట్టుగా వంశీని మధ్యాహ్నం 1.10 గంటలకు కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు.




**తెలియదు... తెలియదు...**

కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో వంశీని నలుగురు అధికారులు ఎనిమిది గంటలపాటు సుదీర్ఘంగా విచారించారు. "సత్యవర్ధన్ జోలికి ఎందుకు వెళ్లారు? అతడిని ఎలా ట్రాప్ చేశారు?"... అంటూ పలు కోణాల్లో ప్రశ్నలు సంధించారు. వాటన్నింటికీ 'తెలియదు... తెలియదు' అని ఆయన సమాధానం ఇచ్చినట్టుగా తెలుస్తోంది. అనంతరం రాత్రి 9.15 గంటలకు వైద్య పరీక్షల నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు ముగిసిన అనంతరం రాత్రి 10.15 గంటల సమయంలో ఆయనను 4వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయాధికారి రామ్మోహన్ ముందు హాజరు పరిచారు. ఇదే కేసులో అరెస్టు చేసిన ఏ7, ఏ8 ఏలినేని శివరామకృష్ణ ప్రసాద్, నిమ్మ లక్ష్మీపతిలను కూడా కోర్టుకు తీసుకొచ్చారు. మరో నిందితుడు, వంశీ వ్యక్తిగత సహాయకుడు వీర్రాజు కోర్టుకు వచ్చి స్వయంగా లొంగిపోయారు. నిందితుల తరఫున మాజీ అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, చిరంజీవి... పోలీసుల తరపున సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేంద్రప్రసాద్, పీపీ సమీర వాదనలు వినిపించారు. రిమాండ్‌పై అర్ధరాత్రి తర్వాత కూడా వాదనలు కొనసాగుతూనే ఉన్నాయి.

**నొటోరియస్ క్రిమినల్!**

**రిమాండ్ రిపోర్టులో పోలీసుల వెల్లడి**

"వల్లభనేని వంశీ నొటోరియస్ క్రిమినల్. ఆయనకు చాలా నేర చరిత్ర ఉంది. చట్టం, న్యాయం అంటే లెక్కే లేదు. ఆయనపై 16 క్రిమినల్ కేసులు ఉన్నాయి".. అని పోలీసులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. "గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనపై సత్యవర్ధన్ ఫిర్యాదు మేరకు వంశీ తదిరులపై కేసు నమోదైంది. ఫిర్యాదు వాపస్ తీసుకోవాల్సిందిగా అప్పటి నుంచే ఆయనపై ఒత్తిళ్లు వస్తున్నాయని సత్యవర్ధన్ సోదరుడు కిరణ్ స్పష్టం చేశారు. కేసు వాపసు తీసుకుంటే డబ్బులు ఇస్తామని... ఒప్పుకోకుంటే చంపేస్తామని బెదిరించారని తెలిపారు. 'పెద్దవాళ్లతో ఎందుకు పెట్టుకుంటారు' అని వజ్ర కుమార్ అనే వ్యక్తి చాలాసార్లు పరోక్షంగా హెచ్చరించారని... కొమ్మా కోటి, రామకృష్ణ, వీర్రాజు తదితరులు తన సోదరుడిని, తల్లిదండ్రులనూ బెదిరించారని కిరణ్ తెలిపారు. ఈనెల 10వ తేదీన తన సోదరుడిని బలవంతంగా కారులో తీసుకెళ్లారని ఫిర్యాదు చేశారు. కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి... మొత్తం నాలుగు బృందాలతో నిందితుల కోసం గాలింపు మొదలుపెట్టాం. 13వ తేదీన ఏ1 వల్లభనేని వంశీని హైదరాబాద్‌లో అరెస్టు చేశాం. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఫిర్యాదుకు సంబంధించి పొట్టి రాము (ఏ9)ను కలవాల్సిందిగా వల్లభనేని వంశీ తనపై ఒత్తిడి తెచ్చారని సత్యవర్ధన్ వాంగ్మూలం ఇచ్చారు. "మాజీ ఎమ్మెల్యేగా, బాగా పలుకుబడి ఉన్న వ్యక్తిగా వంశీ ఏమైనా చేయగలరు. ఆయన ఆదేశాల మేరకు పొట్టి రాము నన్ను హనుమాన్ జంక్షన్‌కు తీసుకెళ్లారు. కేసు వాపసు తీసుకుంటున్నట్లు రాసిన వాంగ్మూలంపై బెదిరించి సంతకం చేయించారు. ఆ తర్వాత... ఏపీ 40 బీజీ 5005 క్రెటా కారులో నన్ను బలవంతంగా కోర్టుకు తీసుకెళ్లారు. అక్కడ వాంగ్మూలం ఇప్పించారు" అని సత్యవర్ధన్ తెలిపారు. 10వ తేదీ అర్ధరాత్రి సత్యవర్ధన్‌ను హైదరాబాద్‌లోని మైహెూం భుజాలో ఉన్న వల్లభనేని వంశీ వద్దకు తీసుకెళ్లారు. కేసు వాపసు తీసుకుంటూ మేజిస్ట్రేట్‌కు ఇచ్చిన వాంగ్మూలానికి కట్టుబడి ఉండాలని మళ్లీ బెదిరించారు. తీవ్రంగా హింసించారు. తేడా వస్తే కుటుంబ సభ్యులనూ చంపేస్తామన్నారు. మరుసటి రోజున... వంశీ ఆదేశాల మేరకు నలుగురు నిందితులు సత్యవర్ధన్‌ను కారులో విశాఖ పట్నం తీసుకెళ్లారు. అక్కడ హెూటల్ చందనలో బస చేశారు. 12వ తేదీన ఏ11కు చెందిన గెస్ట్‌హౌసకు మకాం మార్చారు. సత్యవర్ధన్ విశాఖపట్నంలో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లాం. ఆరిలోవ పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించి... దేవ దుర్గ శివ రామకృష్ణ, నిమ్మల లక్ష్మీపతి అనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని... సత్యవర్ధన్‌ను రక్షించాం. ఆయనను విజయవాడకు తీసుకు వచ్చాం" అని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. వంశీతోపాటు మిగిలిన ఇద్దరు నిందితులను 15 రోజులు రిమాండ్‌కు పంపించాలని కోరారు.

## పర్యాటకంలో అవకాశాలు అపారం

-మొదటిపేజీ తరువాయి

ఈ క్రమంలో జాతీయ, అంతర్జాతీయ ట్రేడ్ ఫేర్ లలో పాల్గొనాలని సూచించారు. అంతర్జాతీయ పర్యాటక ప్రాజెక్టులను అధ్యయనం చేయాలని దిశానిర్దేశం చేశారు. టూరిజం అంటే ఈవెంట్స్, టాలెంట్స్, హెూటల్స్, ట్రావెల్ అండ్ టూరిస్ట్ ఆపరేటర్స్, స్కిల్ ఇన్ స్టిట్యూషన్స్ అని సీఎం అభివర్ణించినట్లు మంత్రి తెలిపారు. ప్రత్యేకించి కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపడుతున్న అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం ఆదేశించారన్నారు. అన్ని వయస్కుల వారు ఆహ్లాదంగా గడిపేలా, పర్యాటక అనుభూతి పొందేలా ఆకర్షించాలన్నారు. గండికోట, ఒంటిమిట్ట, సోమశిల డ్యామ్, తాళ్లపాక అన్నమాచార్యుని స్వస్థలం వంటి ప్రాంతాలను టూరిజం సర్క్యూట్ లుగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేకించి ఈ ఏడాది చివరి నాటికి హెూటళ్లలో 20వేల రూమ్స్ అందుబాటులోకి తేవాలన్నారు. ఐదేళ్లలో రాష్ట్రంలో 50 వేల రూమ్స్ అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. సరైన సమయ ప్రణాళికతో ముందుకెళ్లి పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏపీటీడీసీ ఛైర్మన్ డా. నూకసాని బాలాజీ, ముఖ్యమంత్రి కార్యదర్శి కార్తికేయ మిశ్రా, టూరిజం శాఖ సెక్రటరీ అజయ్ జైన్, ఆర్కియాలజీ డిపార్ట్ మెంట్ కమిషనర్ జి. వాణిమోహన్, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ గౌతమ్ అల్లాడ, టూరిజం శాఖ ఎండీ ఆమ్రపాలి కాట, ఈడీలు పద్మావతి, శేషగిరి, ఏపీ టూరిజం అథారిటీ సీఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి ప్రాజెక్టులు గడువులోగా పూర్తవ్వాలి

-మొదటిపేజీ తరువాయి



**అమరావతి**

గడువులోగా ప్రాజెక్టుల పనులు పూర్తికావలసిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అలా పూర్తి చేయకపోతే కాంట్రాక్టు సంస్థలు, అధికారులనే బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. 2027 డిసెంబరునాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలని.. దాని ఫలితాలు వచ్చేలోగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఫలాలు ఆ ప్రాంత ప్రజలకు దక్కాలని చెప్పారు. గురువారమిక్కడ వెలగపూడి సచివాలయంలో జల వనరుల శాఖపై ఆయన సమీక్షించారు. పోలవరం పనులపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 1,379 మీటర్ల డయాఫ్రం వాల్.. ఇప్పటికి 51 మీటర్ల మేర పూర్తయిందని తెలిపారు. కుడి, ఎడమ కాలువ కనెక్టివిటీ పనుల్లో కొంత జాప్యం ఉందన్నారు. వచ్చే సమీక్ష నాటికి పోలవరం కనెక్టివిటీ పనుల్లో వేగాన్ని పెంచాలన్నారు. 'పోలవరం నిర్మాణం రోజువారీగా ఎంత జరగాలి.. ఎంత జరిగిందో కాంట్రాక్టు సంస్థలు, అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ఉండాలి. లక్ష్యాల మేరకు పనులు పూర్తిచేయకపోతే వారినే బాధ్యులను చేస్తాం. హెడ్‌వర్క్స్ పనులు 2027 డిసెంబరునాటికి పూర్తిచేయాల్సిందే. మొదట 17,500 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో డిజైన్ చేసినట్లుగానే కాలువల నిర్మాణాన్ని పూర్తిచేయాలి. ఎడమ కాలువ పనులు ఈ ఏడాది పూర్తి చేయాలి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా గోదావరి జలాలను వెనుకబడిన ఉత్తరాంధ్రకు తరలించే చర్యలు చేపట్టాలి. చింతలపూడి ఎత్తిపోతలపై న్యాయస్థానంలో ఉన్న కేసులను పరిష్కరించాలి' అని సూచించారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల జాప్యంపై సీఎం అసహనం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తానే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశానని.. 30 ఏళ్లుగా ఇంకా నిర్మాణ దశలోనే ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. భూగర్భ జలాల పెంపు తన స్వప్నమని చంద్రబాబు అన్నారు. 'భూగర్భజలాలు 3నుంచి 9మీటర్ల లోతులోనే లభ్యం కావాలి. పంచాయతీరాజ్, అటవీ, జల వనరులు, వ్యవసాయ, పురపాలక శాఖల మంత్రులతో కమిటీని వేయాలి. భూగర్భజలాల పెంపుపై ఈ కమిటీ నిర్మాణాత్మకమైన ఆలోచనలను అమలు చేయాలి' అని సూచించారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

**ప్రాజెక్టులపై కార్యాచరణ**

వైసీపీ పాలనలో విధ్వంసానికి గురైన ప్రాజెక్టుల వేగాన్ని పెంచి కార్యాచరణ లక్ష్యం మేరకు పూర్తిచేయాలని జలవనరుల శాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. పోలవరం-బనకచర్ల అనుసంధానం పథకాన్ని మూడు దశల్లో పూర్తి చేస్తామని సీఎం సమీక్షలో కార్యాచరణను వెల్లడించింది. దీనిలో భాగంగా ఏటా జూలై 1 నుంచి 100 రోజులపాటు రోజుకు 2.46 టీఎంసీల చొప్పున 246 టీఎంసీలను తరలిస్తారు. కుడి ప్రధాన కాలువను 17,500 నుంచి 35,500 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి విస్తరిస్తారు. మొదటి దశలో తాటిపూడి వరద కాలువ వద్ద 18,000 క్యూసెక్కులను.. మిగిలిన 17,500 క్యూసెక్కులను కుడి కాలువ నుంచి ప్రకాశం బ్యారేజీకి తరలిస్తారు. సెగ్మెంట్-2లో ప్రకాశం బ్యారేజీ నుంచి బొల్లాపల్లికి గోదావరి జలాలను తరలిస్తారు. వైకుంఠపురం హెడ్‌వర్క్స్ నుంచి బొల్లాపల్లి రిజర్వాయరుకు తరలిస్తారు. ఇందుకోసం 6 ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తారు. బొల్లాపల్లి రిజర్వాయరును 150 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మిస్తారు. 15హేబిటేషన్ల గుండా 31 కిలోమీటర్ల గోదావరి జలాలను తరలేలా కార్యాచరణ సిద్ధం చేశారు. గోదావరి జలాలను నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువకు అనుసంధానం చేస్తారు. మూడో సెగ్మెంట్‌లో బొల్లాపల్లి నుంచి 115 కిమీ మేర బనకచర్లకు 23,000 క్యూసెక్కుల చొప్పున తరలిస్తారు. కాగా, కూటమి ప్రభుత్వంలో ఆరు నెలలకే అంటే డిసెంబరు నాటికే 77.31% మేర పోలవరం ప్రాజెక్టు పనులు (5.38%) పూర్తయ్యాయి. కొత్త డయాఫ్రం వాల్ పనులు ఈ ఏడాది చివరకు పూర్తవుతాయి. కాగా..హంద్రీ-నీవా తొలిదశ పనులను 2026కల్లా పూర్తిచేయాలని జలవనరుల శాఖ డెడ్‌లైన్ పెట్టుకుంది. ఈ ఏడాది మే నాటికి పుంగనూరు, కుప్పం బ్రాంచి కెనాల్ పూర్తి చేయాలని కార్యాచరణ సిద్ధం చేసింది.

## టూరిజం ప్రాజెక్టులకు మహర్దశ

**విశాఖపట్టణం :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటకరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుంది. ముఖ్యంగా టూరిజం ప్రాజెక్టులను త్వరితగతిన వేగంగా పూర్తి చేయడానికి అడుగులు వేస్తుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా అనుమతులు శరవేగంగా రావడానికి అవసరమైన ప్రతిపాదనలకు ఓకే చెప్పనుంది. దీంతో ఏపీలోని పలు టూరిజం ప్రాజెక్టులకు మహర్దశ పట్టనుంది. ఆంధ్రప్రదేశ్ స్వదేశీ దర్శన్ క్రింద అభివృద్ధి చేయనున్న నాగార్జున సాగర్, అహోబిలం, సూర్యలంక ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్‌లను త్వరితగతిన ఆమోదించాలని ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అభ్యర్థనకు కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సానుకూలంగా స్పందించారు. మరో వారం, పది రోజుల్లో సంబంధిత ప్రక్రియ చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తరపున వివిధ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపినందుకు కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖకు మంత్రి కందుల దుర్గేశ్ కృతజ్ఞతలు తెలిపారు. పర్యాటక మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేశ్ మాట్లాడుతూ , కేంద్ర ప్రభుత్వ పథకాల సహకారంతో రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు. ప్రధానంగా విశాఖపట్టణం జిల్లా సింహాచలం ఆలయ అభివృద్ధి పనులు అరవై శాతం పూర్తయ్యాయని, కాకినాడ జిల్లా అన్నవరం దేవాలయ అభివృద్ధికి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారుఇవన్నీ పూర్తయితే పర్యాటక రంగం పూర్తిగా అభివృద్ధి చెందడంతో పాటు రాష్ట్రానికి కూడా అదనంగా ఆదాయం రానుంది. గత ప్రభుత్వం లెక్కకు మించిన అప్పులు చేయడంతో దానిని పూడ్చుకునేందుకు ప్రతి శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోకస్ పెట్టారు. అందులో ఏపీలో టూరిజానికి ప్రత్యేకత ఉంది. దేవాలయాలతో పాటు విశాలమైన సముద్ర తీర ప్రాంతం కూడా ఉండటం, బీచ్ లతో పాటు కోనసీమ అందాలు వంటి వాటితో పాటు అరకు వంటి వాటిని హైలెట్ చేయగలిగితే ఎక్కువ మంది పర్యాటకులు వచ్చే అవకాశముంది. ఏపీకి టూరిజం నుంచి అత్యధిక ఆదాయం రాబట్టేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నాలు చేయడంలో భాగంగా ప్రతి చిన్న విషయాన్ని కూడా పరిశీలిస్తుంది. వాటిని గ్రౌండ్ చేయడానికి సిద్ధమవుతుంది. అక్కడ పర్యాటకులకు అవసరమైన అన్ని సదుపాయాలతో పాటు రవాణా, వసతి వంటి సౌకర్యాలపై దృష్టి పెట్టింది.

తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036



## రెవిన్యూ పోలీస్ అధికారుల అండతో రెచ్చిపోతున్న

# మట్టి మాఫియా

* మంత్రి పేరు చెప్పి మరీ మట్టి దందా...
* సహజ వనరుల విధ్వంసం
* మట్టి టిప్పర్లు మనవాళ్లవే అంటూ హుకూం జారీ చేస్తున్న అధికార పార్టీ నేత ఎవరు?

**స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా ఫిబ్రవరి / 13**

సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజక వర్గం మట్టి మాఫియాకు అడ్డాగా మారింది.ఎక్కడ మట్టి గుట్టలు కనిపిస్తే అక్కడ గద్దల్లా వాలి నిబంధనలకు విరుద్ధంగా యదేచ్ఛగా మట్టి తవ్వి తరలిస్తున్నారునియోజకవర్గం లోని కొంత మంది ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు మట్టి మాఫియా అవతారం ఎత్తి వ్యాపారం చేస్తూ లక్షల రూపాయలు గడిస్తున్నారు.మట్టి తరలింపు వెనుక అధికార పార్టీ నాయకుల సపోర్ట్ ఉండటంతో మట్టి దందా జోరుగా సాగుతోంది.పగలు,రాత్రి తేడా లేకుండా తవ్వకాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై ప్రజల్లో పలు అనుమానాలు



వ్యక్తమవుతున్నాయినియోజకవర్గ పరిధిలోని మేళ్లచెర్వు రెవెన్యూ ఎర్రగట్టు గ్రామంలో గత కొన్ని నెలలుగా ప్రభుత్వ,పట్టా భూముల్లో పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరుపుతూ పదుల సంఖ్యలో టిప్పర్లలో మట్టిని పట్టపగలే



ఖాళీ స్థలాలు, లేఅవుట్లుకు తరలిస్తూ ఒక్కొక్క టిప్పర్ కి మూడు నుండి ఐదు వేల వరకు వసూలు చేస్తున్నారు భారీగా మట్టి వ్యాపారం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారుదీనిపై అధికారులకు సమాచారం ఉన్నా ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని పైసా పెట్టుబడి లేకుండా ప్రకృతి వనరులను కాజేస్తూ ప్రతి నెలా లక్షల రూపాయలు కొల్లగొడుతున్న మట్టి దళారుల నుంచి క్రమం తప్పకుండా కమీషన్లు ముట్టి మట్టి దందాపై ఎవరు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని నియోజకవర్గం మొత్తం కోడై కూస్తోంది.జేసీబిలతో మట్టిగుట్టలను తవ్వి 10 టిప్పర్లతో మట్టి తరలిస్తూ ప్రకృతి సంపదను అక్రమంగా దోచుకుంటు మంత్రి పేరు బదనాం చేస్తున్నా మట్టి మాఫియాపై చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోడం లేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

# పల్లం విద్యార్థుల విజ్ఞాన యాత్ర.

**ఏర్పేడు స్వర్ణ సాగరం :-**

పల్లం ఉన్నత పాఠశాలకు చెందినటువంటి 90 మంది విద్యార్థులు 10 మంది ఉపాధ్యాయుల తో కూడిన బృందం ఈనెల 11వ తేదీన అంతరిక్ష పరిశోధన కేంద్రమైనటువంటి శ్రీహరికోట ను సందర్శించడం జరిగింది. ప్రస్తుత సాంకేతిక పురోగతులను అర్థం చేసుకోవడానికి మరియు విద్యార్థులకు అవసరమైన అనుభవాన్ని అందించడానికి ఈ సందర్శన ఏర్పాటు చేయడం జరిగింది. విద్యార్థులు ఎస్ డి ఎస్ సి షార్ యొక్క వివిధ సౌకర్యాలను సందర్శించారు అవి ప్రయోగ ప్రాంతం ప్రయోగ కేంద్రం ఉపగ్రహ నియంత్రణ కేంద్రం మరియు అంతరిక్షం సంగ్రహాలయం .అక్కడ విద్యార్థులకు రాకెట్లను ఎలా తయారు చేస్తారు? వాటిని ఎలా అంతరిక్షం లోకి పంపబడతాయి మరి అనేక విజ్ఞాన సంబంధమైనటువం



టి విషయాలను గ్రహించడం జరిగింది. రాకెట్ లాంచింగ్ లో అడ్వాన్స్ టెక్నాలజీ విద్యార్థులకు వివరించడం జరిగింది. రాకెట్ ప్రయోగ సందర్శన అనేది ఒక ఆసక్తికరమైన అనుభవం. రాకెట్ నిర్మాణం, ప్రయోగం చేయడం అనే దశలను విద్యార్థులు పరిశీలించారు. విద్యార్థులలో వైజ్ఞానికవేత్తలు కావాలనే ఆసక్తిని రేకెత్తించడానికి ఈ విజ్ఞాన యాత్ర ఎంతగానో ఉపకరిస్తుంది. ఈ విజ్ఞాన యాత్రకి పల్లం పాఠశాలకు చెందినటువంటి ఒకేషనల్ విద్యార్థులు కూడా హాజరవడం జరిగింది. ఐటి ట్రైనర్ అయినటువంటి సుధారాణి అడ్వాన్స్ టెక్నాలజీల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ విహారయాత్ర పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ టి. ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ వ్యవహారయాత్రకు పాఠశాలకు చెందినటువంటి ఉపాధ్యాయులు అయినా రామచంద్రయ్య, శ్రీనివాసులు, సురేష్ బాబు , శ్రీరాములు వెంకట రమణయ్య , ఓబులమ్మ, పద్మావతమ్మ ఈ విహారయాత్రకి విద్యార్థులతోపాటు వెళ్లడం జరిగింది.

## సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో సరోజినీ నాయుడు జయంతి



**ఇందుకూరుపేట స్వర్ణసాగరం ఫిబ్రవరి 13**

మండలంలోని పల్లిపాడు పినాకిని గాంధీజీ సత్యాగ్రహ ఆశ్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలోప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, సమాజసేవకురాలు, దేశంలో తొలి మహిళా గవర్నర్ సరోజినీ నాయుడు జయంతి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా కమిటీ సభ్యులు గంపల. మంజుల సరోజినీ నాయుడు చిత్రపటానికి నూలుమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి మాట్లాడుతూ మన దేశంలో మహిళల సాధికారత, సమస్యలపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో సరోజినీ నాయుడు పుట్టిన రోజును జాతీయ మహిళా దినోత్సవంగా పాటిస్తారని తెలిపారు. ఆమె స్వాతంత్ర్య సమరయోధురాలు మాత్రమే కాదు మహిళా చైతన్యానికి, స్వతంత్ర వ్యక్తిత్వానికి ప్రతీక సరోజినీ నాయుడు. మహిళల అభివృద్ధిలో భారతీయ సమాజంలో ఉన్న దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడినట్లు చెప్పారు, ఇలాంటి మహోన్నత వ్యక్తులు గురించి నేటి తరం బావి భారత పౌరులు అయిన విద్యార్థులు తెలుసుకో వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి “కాకాణికి” స్వాగతం పలికిన పశు గణాభివృద్ధి సంస్థ చైర్మన్ “గొల్లపల్లి ‘

**ఇందుకూరుపేట స్వర్ణ సాగరం ఫిబ్రవరి 13**



మండలంలోని పున్నూరుగ్రామంలో ఓ వివాహం సందర్భంగా హాజరైన మాజీ మంత్రి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణిగోవర్ధన రెడ్డినిఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్ తన నివాసంలో మాజీ మంత్రి నిమర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారుఉభయులు స్థానిక రాజకీయాలపై చర్చించుకున్నారు

## 14న నెల్లూరు వ్యవసాయ పరిశోధన స్థానం లో” కిసాన్ మేళా”

**వ్యవసాయ అధికారుల విజ్ఞప్తి**

**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఫిబ్రవరి 13**

నెల్లూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో శుక్రవారం కిసాన్ మేళ నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారులు తెలిపారుఈ మేళాలో మండలానికి చెందిన అన్ని గ్రామాల రైతాంగం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు

## చిత్తూరు జిల్లావి.కోట మండలంలోమెగా మెడికల్ క్యాంప్



**వి.కోట స్వర్ణ సాగరం డిసెంబర్ 13,**

చిత్తూరు జిల్లా వి కోట మండలంలో జిల్లా పరిషత్ హై స్కూల్, ఆవరణంలో, ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది, ఇందులో భాగంగా, బిగ్ టివి ఆధ్వర్యంలో కుప్పం పి ఈ ఎస్ మెడికల్ కాలేజ్, అండ్ హాస్పిటల్, వారి సౌజన్యంతో, గురువారం రోజు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది, ఇందులో భాగంగా, అనేకమంది ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు, డాక్టర్లు వారికి తగిన సూచనలు సందేహాలు ఇచ్చారు, ఈ కార్యక్రమానికి మండల టిడిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రులు, తదితరులు పాల్గొన్నారు

## ఆటపాటలతో కూడిన విద్య అవసరం.



**పెళ్లకూరు స్వర్ణసాగరం ఫిబ్రవరి 13.**

అంగన్వాడి కేంద్రాలలో ఉన్న ఆరేళ్లలోపు చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అవసరమని ఐ సి డి ఎస్ సి డి పి ఓ ఉమామహేశ్వరి పేర్కొన్నారు. గురువారం పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాలలోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడం వల్ల ప్రాథమిక పాఠశాలకు అలవాటు పడతారని సూచించారు. అలాగే చిన్నారులకు, బాలింతలకు, అందించే పోషక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శంకరయ్య, సూపర్వైజర్ సాయి లక్ష్మి, వివిధ అంగన్వాడి కేంద్రాల వర్కర్లు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మ కు ప్రత్యేక పూజలు



**సొసైటీ డైరెక్టర్ బోడ నాగేశ్వరావు..**

**స్వర్ణసాగరం డోర్నకల్ ఫిబ్రవరి 13**

డోర్నకల్ మండలం కాస్నాతండ గ్రామ శివారులో సమ్మక్క సారలమ్మ మినీ జాతర రెండో రోజు కొనసాగుతుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సొసైటీ డైరెక్టర్ బోడ నాగేశ్వరావు, కుటుంబం సభ్యులు వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.తల్లుల ఆశీస్సులతో ప్రజలు సుఖశాంతులతో సిరిసంపదలతో ఆనందంగా ఉండాలని సమ్మక్క సారలమ్మ తల్లులను వేడుకున్నామన్నారు.

## పోషణ భీ - పడాయి భీ ప్రోగ్రామ్ పైశిక్షణ కార్యక్రమం



**ఏర్పేడు స్వర్ణ సాగరం :-**

పోషణ భీ – పడాయి భీ ప్రోగ్రామ్ పైన అంగన్వాడీ కార్యకర్తలు కు శిక్షణ కార్ర్యమాన్ని నిర్వహించడం జరిగింది.ఇందులో పోషణ మరియు ప్రీస్కూల్ కార్యక్రమాల పైన అవగాహన కల్గించడము బిడ్డ పుట్టినప్పుడు నుడి వారిలో కలిగే డెవలప్మెట్ గురించి తెలియజేయడం జరిగింది .సీడీపీఓ మాట్లాడుతూ బిడ్డ ఆరోగ్యంగా ఉం డడము తో బాటు ప్రీస్కూల్ అనేది ఎంత అవసరమో వారి బావి జీవితానికి పునాది .ఈ వయసు లో నేర్చుకున్నది వారికి బాగా గుర్తు ఉంటుంది .పరిసరాలు నుండి కూడా బాగా గ్రహించ గలుగుతారు. అంతే కాకుండా దిసెబులిటి చిల్డ్రన్స్ దివ్యంగా పిల్ల ఐడెంటిఫై చేయడము అనేది కూడా ఎలా తెలుసు కోవలో సెప్పడము జరిగింది.పా జెక్ట్ ఆఫీసర్ కృష్ణమంజరి సూపెర్వైజర్స్ ప్రగతి శిరీష. అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతిని కుటుంబానికి సహాయం



**చిలుకోడు గ్రామ గౌడ్ సంఘం సర్పంచ్ మంద రామారావు..**

**స్వర్ణసాగరం డోర్నకల్ ఫిబ్రవరి 13**

డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో గోరు భిక్షం, ఇటీవల మృతి చెందారు. గురువారం అ గ్రామ గౌడ్ సంఘం సర్పంచ్ మంద రామారావు,దివంగత వారి తల్లిదండ్రులు మంద వెంకయ్య, వెంకమ్మ,జ్ఞాపకార్థంగా మృతుని కుటుంబానికి పది వేల రూపాయలు ఆర్థిక సహాయం అందచేశారు.. వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని రామారావు తెలిపారు...ఈ కార్యక్రమంలో సమ్మెట శీను, సమ్మెట వెంకన్న, మంద గోపయ్య, జనార్ధన్, కాడెం బంగారు, హుస్సేన్, పోన్నం రాములు,గోపయ్య,మంద వెంకన్న,మడ్డి వెంకన్న, కొలిపాక నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు..

# “సర్వేపల్లి మూలస్థానేశ్వర శివాలయం “కోనేటిని” పరిశుభ్రం చేయండి



## దేవాలయ అధికారులకు జనసేన నేత విజ్ఞప్తి

వెంకటాచలం స్వర్ణ సాగరం ఫిబ్రవరి 13

మండలంలోని సర్వేపల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన మూలస్థానేశ్వర స్వామి శివాలయానికి సంబంధించిన కోనేటిని బాగు చేసి భక్తులకు సౌకర్యం కల్పించాలని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బిసురేష్ నాయుడు దేవాలయ అధికారులకు విజ్ఞప్తి చేశారు . గురువారం ఆయన జన సైనికులతో కలిసి దేవాలయంలోని కోనేటిని పరిశీలించారు కోనేరు చుట్టూ కంపలు కోనేటిలో నీటిని శుభ్రం చేయకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు శివరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా భక్తులు కోనేటిలో స్నానం చేస్తారని ఈ లోపుగా దేవస్థానం అధికారులు కోనేటిని శుభ్రపరచాలని కోరారు. ఈ పరిశీలనలో స్థానికులు పినిశెట్టి మల్లికార్జున్ సందూరి శ్రీహరి పి వాసు చిట్టిబోయిన నవీన్ సర్వేపల్లి రవి తదితరులు ఉన్నారు

# “13 నుంచి అంగన్వాడీ కార్యకర్తలకు’ పోషక్ కేభీ ఫడాయిభీ’శిక్షణా తరగతులు



తోటపల్లి గూడూరుస్వర్ణ సాగరం ఫిబ్రవరి 13

అంగన్వాడీ కార్యకర్తలకుపోషక్ కేభీ ఫడాయిభీపై అంగన్వాడీ కార్యకర్తలకు 13 నుంచి 15 వరకు నిర్వహిస్తున్నట్లు2 రోజులపాటు తోటపల్లి గూడూరు జిల్లా పరిషత్ హై స్కూల్లో శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారుప్రధానంగా ఈ శిక్షణలో 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల లోపుచిన్నారులకు ప్రాథమిక విద్యపై అవగాహన చిన్నారుల మెదడుకుతగిన విధంగా బోధన పోషక ఆహార విలువలు తదితర విషయాలపై ఈ శిక్షణా తరగతులకుప్రాధాన్యత సంతరించుకుంది ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట సిడిపిఓకే రాజేశ్వరి పాఠశాలఅసిస్టెంట్ హెచ్ఎంసుధాకర్ సూపర్వైజర్లు కే రంగమ్మ పి విజయలక్ష్మి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

# శ్రీ కోటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



కోట స్వర్ణసాగరం ఫిబ్రవరి 13

కోట మండలం శ్యామసుందర పురం గ్రామంలో స్వర్ణముఖి నది తీరంలో వేంచేసియున్న శ్రీ అంకాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ కోటేశ్వర స్వామి ఆలయ నిర్మాణమునకు శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఆలయ నిర్మాణ నిర్వహణ చైర్మన్ గూడపాకల సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ చైర్మన్ నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి కవితమ్మ దంపతులు ముఖ్యఅతిథిగా విచ్చేసి భూమి పూజా కార్యక్రమంలో పాల్గొని భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.వేద పండితుల నడుమ జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో గ్రామస్తులు స్థానికులు భారీ సంఖ్యలో భూమి పూజా కార్యక్రమంలో పాల్గొని చిల్లర, నవధాన్యాలు,బంగారం,వెండి,శంకు కింద సమర్పించి శివపార్వతుల అనుగ్రహము పొందారు.ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ నిర్వహణ చైర్మన్ గూడపాకల సుబ్బారావు మాట్లాడుతూ అతి పురాతన శ్రీ అంకాల పరమేశ్వరి దేవత ఆలయాన్ని ఇటీవల జీర్ణోద్ధరణ చేయటం జరిగిందని, భక్తుల ఆదరణతో అమ్మవారికి అత్యంత వైభవముగా పూజా కార్యక్రమంలో కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం అంకమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో నిర్మించదలచిన శివాలయం ఆలయ నిర్మాణమునకు దాతలు తమ వంతు సహాయ సహకారాలు,అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రప్రసాద్ నాయుడు,అల్లం రమణయ్య,బాబు రావు,బాలకృష్ణా రెడ్డి,ఆవుల సుబ్బయ్య,పన్నగ సాయి, హనుమంతు రెడ్డి,పోలేంద్ర,శరవణ, సునీల్ స్వామి,గ్రామస్థులు,భక్తులు పాల్గొన్నారు.

# మహా కుంభాభిషేక మహోత్సవంలో పూతలపట్టు ఎమ్మెల్యే



## మురళీమోహన్, పులివర్తి నానిలకు పూర్ణకుంభ స్వాగతం పలికిన అర్చకులు

## ఆలయంలో నిర్వహించిన వైదిక కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు అందుకున్న మురళీమోహన్, పులివర్తి నాని.

పూతలపట్టు స్వర్ణ సాగరం ఫిబ్రవరి 13

చిత్తూరు జిల్లా, పూతలపట్టు మండలం, కొత్త వెంకటాపురం గ్రామంలో మాజీ జెడ్పీటీసీ వనజా బాబురావు, వాసుల చేత నూతనంగా నిర్మించబడిన శ్రీ బాల వినాయక, శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ శ్రీ కలికిరి మురళీమోహన్ గారు, మరియు చంద్రగిరి శాసనసభ్యులు శ్రీ పులివర్తి నాని గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న వీరికి ఆలయ అర్చకులు ఆలయ సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా వేద పండితులు అందజేసిన పవిత్రమైన అభిషేక జలాలతో మురళీమోహన్ గారు, పులివర్తి నాని గారు స్వామివారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించినగణపతి హోమం, మహా అభిషేకం, లక్షార్చన వంటి పూజాకార్యక్రమాల్లో వీరు పాల్గొన్నారు. అనం తరం స్వావి ుවారి హోంతి సేవలో పాల్గొని, భక్తులతో కలిసి తీర్థ ప్రసాదా లను స్వీకరించారు. ఈ సందర్భ ంగా పూతలపట్టు శాసనస భ్యులు మురళీమోహన్ గారు మాట్లాడుతూ ...”ఆధ్యాత్మికత మన జీవితంలో కీలక భాగమని, ఇలాంటి పవిత్ర ఆలయా లు భక్తుల ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని ఆయన అన్నారు. “శ్రీ బాల వినాయక, శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి అనుగ్రహంతో గ్రామం సుభిక్షంగా ఉండాలని మన సారా కోరుకుంటున్నట్లు తెలియజేశారు. ఆలయ నిర్మాణం కోసం కృషి చేసిన మాజీ జెడ్పీటీసీ వనజా బాబురావులను అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి మేము మద్దతుగా ఉంటాం” అని పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ గారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దొంబాబు చౌదరి, మాజీ జెడ్పీటీసీ వనజా బాబురావు, ఆల య నిర్మాణ కర్త వాసు, మరియు మండల నాయకులు, కార్యకర్తలు, వెంకటాపురం గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

# ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి!...





దొరవారిసత్రం మండలం,
స్వర్ణసాగర న్యూస్, ఫిబ్రవరి 13.

ఈ ప్రాంతంలో రబీ సీజన్ ధాన్యం ధర బాగా పడిపోయింతో గురువారం మండలంలోని వేణుంబాక, వెదురుపట్టు, వెదురుపట్టు రాజుపాలెం గ్రామాల్లో ధాన్యం కల్లాల దగ్గరకు వెళ్లి రైతు కూలీ సంఘం ప్రతినిధి బృందం రైతుల కలిసి సమస్యలను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివి రమణయ్య, ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఆర్ సుబ్బరాయుడు, రైతు సంఘాల సమాఖ్య సూళ్లూరుపేట ఏరియా నాయకులు చింతం రెడ్డి రాజశేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ నేడు 75 కేజీల ధాన్యం బస్తాని 1650 రూపాయలకు మాత్రమే అడుగుతున్నారని, గత సంవత్సరం ఈ సీజన్లో 2200 రూపాయలు అమ్మిందన్నారు. అసలే వర్షాకాలంలో ముసురు పట్టడంతో వరి పంట సక్రమంగా రాలేదు. చీడపీడల వల్ల దిగుబడి బాగా తగ్గింది. గత సంవత్సరం ఎకరాకి 40 బస్తాలు కాగా ఈ సంవత్సరం 25 బస్తాలు మాత్రమే పండాయి. దిగుబడి తగ్గడం, ఎరువులు, పురుగుమందుల ఖర్చులు బాగా పెరిగాయన్నారు. గోరుచుట్టు పై రోకటి పోటు చందంగా నేడు ధరలు పడిపోవడంతో రైతుల పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. సంవత్సరం అంతా ఎదురుచూసిన రైతాంగానికి ఈ సీజన్లో చివరికి గడ్డి మాత్రమే మిగులుతోందన్నారు. బస్తా ధర 2500కు పెంచి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కనీసం బస్తా మీద 500 రూపాయలు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర నామ మాత్రమేనని రైతాంగానికి న్యాయమైన గిట్టుబాటు ధర ఇవ్వాలంటే బస్తా 2500, పుట్టి 28,750 ధరకు కొనుగోలు చేయాలన్నారు. ఇప్పటికే రైతు సంఘాలు పెట్టుబడి ఖర్చులు, కౌలు, కుటుంబ శ్రమకు మొత్తానికి 50 శాతం అదనంగా కలిపి (సి 2ం50) మద్దతు ధరను నిర్ణయించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికే రైతాంగం పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా పాలకులు కుట్రపూరితంగా వ్యవహరి స్తున్నా రని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు ఎస్ కే. షబ్బీర్, చాంద్ భాషా, షేక్ మస్తాన్ లు తమ సమస్యల్ని సంఘ నాయకుల దృష్టికి తెచ్చారు.

# “సోమవారం నుంచి” ఇందుకూరుపేట మీదుగా’ రింగ్ బస్’



## బిజెపి నేతలకు హామీ ఇచ్చిన ఆర్టీసీ 2 డిపో మేనేజర్

## ఫలించిన బిజెపి పోరాటం

ఇందుకూరుపేట స్వర్ణ సాగరం ఫిబ్రవరి 13

మండల బిజెపి అధ్యక్షులు కైలాసం శ్రీనివాసులు రెడ్డి ఇందుకూరుపేట మీదుగా ప్రయాణికుల అవసరాల నిమిత్తం రింగ్ బస్సు ఏర్పాటు కోసం గట్టిపోరాటం చేశారు. ఆ పోరాటం ఫలించి 2 డిపో మేనేజర్ సోమవారం నుంచి బస్సు నడిపేందుకు బిజెపి నేతలకు హామీ ఇచ్చారురింగ్ బస్ అభ్యర్థనపై బిజెపి ఆధ్వర్యంలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని అదేవిధంగా ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డిని కలిసి అభ్యర్థించారు. సురేష్ రెడ్డి ఆదేశాల మేరకు బిజెపి నేతలు ఆర్టీసీ టు డిపో మేనేజర్ శివ కేశవ్ యాదవును గురువారం కలిశారు. రింగ్ బస్సు సోమవారం నుంచి నడిపేందుకు హామీ ఇవ్వడంతో బిజెపి పోరాటం ఫలించింది.

2 డిపో మేనేజర్‌ను కలిసిన వారిలో సిహెచ్ గాంధీ భక్తాన్ని వికాస్ శ్రీనివాసులు ఉన్నారు

# ఎమ్మెల్యే షాజహాన్ బాషా ను కలిసిన తగ్గువారిపల్లి యువకులు

బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.13



బంగారుపాళ్యం మండలంలోని నందిని ప్లాజా దగ్గర గురువారం మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ను మర్యాద పూర్వకంగా కలిసిన మైనారిటీ లీడర్ షబిర్,యూత్ ప్రెసిడెంట్ మహేష్ లు ఎమ్మెల్యే ని ఘనంగా స్వాగతం పలికారు.రంజాన్ తోఫా, బీసీ రుణాలు,హజరత్ మౌజాన్ వేతనాలు,ఈద్ గా,కి మైనారిటీ నిధులు మంజూర్ చేయడం హర్షనీయం అని కొనియాయాడారు. మైనారిటీ సమస్యలు చర్చించడం జరిగింది. పెద్దలు గౌరవనీయులు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని కోరడం జరిగింది.ఈ కారిక్రమం లో తగ్గువారిపల్లి రెడ్డప్ప, సోమా,విజయ్,గోవింద, పిజి ఉమాపతీ,గిరి,మేస్త్రి అబ్దుల్లా,సల్మాన్,సాదిక్, రఫీ పాల్గొనడం జరిగింది

# రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

రేణిగుంట స్వర్ణ సాగరం ఫిబ్రవరి 13



రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ఆధ్వర్యంలో అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ తిరుపతి వారి సహకారం– సౌజన్యంతో ఇన్స్టిట్యూట్ ఆవరణలో రుయా హాస్పిటల్ వారికి మేఘా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ల అధినేత డాక్టర్ సి. రామచంద్రారెడ్డి విచ్చేసి ఆరంభించి, మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ప్రాణాలను కాపాడేందుకు మా కళాశాల విద్యార్థిని విద్యార్థులు తమ వంతు సహాయం అందించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు, తదుపరి కళాశాల ప్రిన్సిపల్ నాదముని రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రాణదాతలుగా మారి రక్తాన్ని అందించినందులకు గర్వంగా ఉందన్నారు, ఈ శిబిరంలో మొత్తం 182 మంది రక్తదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో నిరంజన్ రెడ్డి, కేశవులు, నరసింహులు, రుయా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జి డాక్టర్ హరిత వారి బృందం, రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ట్రస్టీలు సుబ్బరత్నమ్మ, మస్తానమ్మ, నిత్యసుధ మరియు సిబ్బంది, రాస్ బాలాజీ బాలవికాస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్ రెడ్డి, సిబ్బంది, రాస్ కె వి కె ఇన్చార్జ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన, రేణిగుంటఎస్ డి పి వో

స్వర్ణ సాగరం ఏర్పేడు :-



మండలంలోని ప్రసిద్ధి గాంచిన గుడిమల్లం పరుశురామేశ్వ స్వామి ఆలయాన్ని మహాశివరాత్రి సందర్భంగా రేణిగుంట ,ఎస్ డి పి ఓ గారితో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన ఏర్పేడు, సీఐ జయచంద్ర మాట్లాడుతూ ఈవో మరియు చైర్మన్ లకు మహాశివరాత్రి సందర్భంగా గుడిమల్లం పరశురామేశ్వర స్వామి దర్శనం నిమిత్తం విచ్చేయు భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా అలాగే పార్కింగ్ సౌకర్యానికి అంతరాయం లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు

# చిత్తూరు 1వ వార్డు ముత్యరేవుల గ్రామంలో పర్యటించిన పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్





**ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు**

**ఎస్సీ కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**గ్రామాల్లో మౌళిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం**

ఐరాల, ఫిబ్రవరి 13 స్వర్ణ సాగరం

పూతలపట్టు నియోజకవర్గం పరిధిలోని 1వ వార్డు ముత్యరేవుల గ్రామాన్ని చిత్తూరు నగర పాలక సంస్థ అధికారులతో కలిసి పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ సందర్శించారు. గురువారం మధ్యాహ్నం ముత్యరేవుల గ్రామానికి చేరుకున్న డాక్టర్ కలికిరి మురళీమోహన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా పరిశీలించారు. అనంతరం ముత్యరేవుల గ్రామస్తులతో మాట్లాడి వారు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని వారి వద్ద నుండి అర్జీలు స్వీకరించారు. తక్షణమే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చిత్తూరు నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా డ్రైనేజీ సమస్య, శ్మశాన స్థలం కేటాయింపు, శ్మశానానికి దారి, ఓవర్ హెడ్ ట్యాంక్, సీసీ రోడ్లు వంటి సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అయితే ప్రజల వినతులను క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను వెంటనే ప్రతిపాదనలు పంపించి నిధులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రాధాన్యత అని, మీరు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. డ్రైనేజీ సమస్య, శ్మశాన స్థలం కేటాయింపు, శ్మశానానికి దారి, సీసీ రోడ్లు ఓవర్ హెడ్ ట్యాంక్ వంటి సమస్యలు చాలా కీలకమైనవని, ఇవి ప్రజల ప్రాథమిక అవసరాలకు సంబంధించినవని ఆయన పేర్కొన్నారు. నేను వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి, అవసరమైన నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపిస్తానని ఆయన చెప్పారు. మీకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అందించేందుకు నా వంతు కృషి చేస్తానని భరోసా కల్పించారు. గ్రామాభివృద్ధి కోసం మీ అందరి సహకారం అవసరమని, కలిసి పని చేస్తేనే అభివృద్ధిని త్వరితగతిన సాధించగలం అని సూచించారు. చిత్తూరు నగర పాలక సంస్థ మేయర్ ఆమూద, కమీషనర్ నరసింహ ప్రసాద్, అసిస్టెంట్ కమీషనర్ ప్రసాద్, ఇంజనేర్ వెంకట్, ఆరోగ్య శాఖ అధికారి లోకేష్, స్థానిక నాయకులు ఎల్.బి. లోకేష్ మరియు ప్రజాప్రతినిధులు, నగర పాలక సంస్థ సిబ్బ ంది, గ్రామ పెద్దలు, ప్రజలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# సత్యవేడు నియోజకవర్గం బీజేపీ కార్యకర్తల సమావేశం.





వరదయ్యపాలెం, స్వర్ణ సాగరం పిబ్రవరి 13

వరదయ్యపాలెం కేబిజి కళ్యాణ మండపం నందు బీజేపీ సత్యవేడు అసెంబ్లీ కన్వీనర్ రాష్ట్ర కార్యదర్శిము నిసుబ్రహ్మణ్యం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఆయన మాట్లాడుతూ బీజేపీని గ్రామ స్థాయిలో బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని సూచించారు. బూత్ కమిటీలు,శక్తి కేంద్రాలు,పదాధికారులు,సమిష్టి కృషితో బీజేపీ ని పటిష్టంగా తయారుచేయాలని కోరారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సామంచిని,నియోజకవర్గం కన్వీనర్ మునిసుబ్రహ్మణ్యంను ,ఈసీ మెంబెర్ గురుదేవ్ ను ఘనంగా సత్కరించారు. వరదయ్యపాలెం మండల అధ్యక్షుడు ఢిల్లీ ప్రకాష్ రాయల్ జిల్లా ఓబీసీ కార్యదర్శి సిద్దులయ్య,జిల్లా కార్యవర్గ సభ్యులు కేబి గురుదేవ్, మాజీ అధ్యక్షులు వేలూరు పురుషోత్తం జనరల్ సెక్రటరీ వేలూరు సూర్యనారాయణ మరియు యు అన్వేష్, యువ మోర్చా అధ్యక్షులు మధుసూదన్, రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు సీనియర్ నాయకురాలు శుభ రత్నమ్మ , బొగ్గల సుబ్రమణ్యం బిగువ నాగేశ్వరరావు, మోహన్ శెట్టి, బొగ్గల యేసు నారాయణ సుబ్రహ్మణ్యం, గుత్తిత్యాగరాజునేత , సత్యవేడు, మండల అధ్యక్షులు ముని ప్రతాప్, కేవీపీ పురం మండల అధ్యక్షులు, నాలి బాబు, జిల్లా సీనియర్ నాయకులు వెంకటయ్య, మున్ని చంద్రారెడ్డి, బుచ్చినాయుడు కండ్రిగ మండలం అధ్యక్షులు హరిబాబు రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా జనరల్ సెక్రెటరీ వాసు, కన్నన్, అంకమ్మ, తదితరు పార్టీ సీరియల్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు ఆదుకోవాలి

**- భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ప్రదేశాలలో**

**ఐదున్నర సంవత్సరాలుగా కొనసాగుతున్న మృత్య ఘోషలు**

**- స్పందించని కార్మిక శాఖ రాష్ట్ర ప్రభుత్వాలు**

**- ప్రమాదవశాత్తు మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడికి తక్షణమే**

**- సంక్షేమ బోర్డు నుండి రాష్ట్ర ప్రభుత్వం**

**- 10 లక్షలు ఎక్స్గ్రేషియా ప్రకటించాలి**

**- బిల్డింగ్ కన్ స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్**

**రి.నెం 379 ఐ ఎఫ్ టి యూ అనుబంధం**

**జిల్లా అధ్యక్ష ఉపాధ్యక్ష జి హరికృష్ణ రెడ్డి కొప్పుల కుమార్**

విజయవాడ :

రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు 36 రకాల వృత్తులలోపనిచెస్తూ మృత్యువాత పడుతుంటే పట్టించుకోనని రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు ప్రమాదాల బారిన పడితే నష్టపరిహారాలు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు కు కార్మికుడు 110 రూపాయలు చెల్లించి బోర్డులో సభ్యులుగా చేరవచ్చు

సంక్షేమ బోర్డులో చేరిన కార్మికులు సంవత్సరానికి 12 రూపాయల చొప్పున ఐదు సంవత్సరాలకి ఒక్కసారి సంక్షేమ బోర్డు కు 60 రూపాయలు చెల్లించి కార్డులు రెన్యువల్ చేయించుకోవచ్చు కానీ ఆ కార్మికుడు పనిచేస్తూ ప్రమాదాన్ని గురై చనిపోయిన కాలు విరిగిన చేయి విరిగిన మహిళా కార్మికురాలు డెలివరీలు అయిన సంక్షేమ బోర్డు నుండి మాత్రం రూపాయి నష్టపరిహారం ఇయ్యకుండా కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేస్తున్న కార్మిక శాఖ రాష్ట్ర ప్రభుత్వాలు గత ప్రభుత్వం అధికారంలోకి రాగానే నవరత్నాలు సాకు చూపి సంక్షేమ బోర్డుని 12 14 సర్క్యులర్ను ప్రవేశపెట్టి సంక్షేమ బోర్డునుండి కార్మికులకు ఇచ్చే నష్టపరిహారాలు తాత్కాలికంగా నిలిపివేసింది సంక్షేమ బోర్డుని అమలు చేయాలని గత ప్రభుత్వంలో ఆరుగురు ఎమ్మెల్యేలకి ఉపముఖ్యమంత్రి కి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి కార్మిక శాఖ మంత్రి కి వినతి పత్రాలు ఇచ్చిన సంక్షేమ బోర్డు సమస్యలు పరిష్కరించిన వారు లేరు ప్రస్తుత కూటమి ప్రభుత్వం మేము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ



కార్మికులకు ఇసుక ఉచితంగా ఇస్తాము సంక్షేమ బోర్డును అమలు చేసి కార్మికులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం ఇస్తామని చెప్పి అధికారం చేపట్టి దాదాపుగా ఎనిమిది నెలలు గడుస్తున్నా పనిచేసే ప్రదేశాల్లో కార్మికులు పిట్టలుగా రాలిపోతున్న కాళ్ళు చేతులు విరిగి మంచాన పడుతున్న కార్మికులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాలు మాత్రం ఇవ్వకుండా కార్మిక శాఖ రాష్ట్ర ప్రభుత్వం సాధ్యం చూస్తుందిభవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుని అమలు చేయాలి అంటే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో డబ్బులు కేటాయించాల్సిన అవసరం లేదు 10 లక్షల పై పడ్డ నిర్మాణాల దగ్గర నుంచి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం 1 పర్సెంట్ సెస్ సంక్షేమ బోర్డుకి చేరుతుంది ఆ డబ్బులను కార్మికుల సంక్షేమానికి ఖర్చు పెట్టకుండా అలా బొర్డుకు వచ్చిన డబ్బులు వందలాది కోట్ల రూపాయలు ఇప్పటికే దారి మళ్ళినవి ఇతర రాష్ట్రాల్లో సంక్షేమ బోర్డు నుండి కార్మికులకు అనేక రకమైన సంక్షేమ పథకాల అమలు చేస్తుంటే సబ్సిడీపై లోన్లు కూడా ఇస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం సంక్షేమ బోర్డు అమలు అమలు చేయకుండా ప్రమాదాల బారిన పడ్డ కార్మికులకి ఇవ్వవలసిన నష్టపరిహారాలు గాని ఇచ్చే పరిస్థితుల్లో కార్మిక శాఖ గాని రాష్ట్ర ప్రభుత్వాలు గాని స్పందించే పరిస్థితి లేదు

మా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుని అమలు చేయాలని కార్మికులు ఆందోళనకు దిగితే అరెస్టులు చేసిన పరిస్థితి ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులు కూడా ప్రజలే అని గుర్తించి సర్క్యులర్ 12 14 తక్షణమే రద్దుచేసి సంక్షేమ బోర్డును యధావిధిగా అమలు చేసి గడిచిన 5న్నర సంవత్సరాలుగా ప్రమాదాల బారిన పడి చనిపోయిన కాలు విరిగిన చేతులు విరిగిన కార్మికులకు ఇవ్వవలసిన నష్టపరిహారాలను తక్షణమే వారి అకౌంట్లో వెయ్యాలి అట్లాగే సంక్షేమ బోర్డు పనిచేయట్లేదు అని ప్రమాదాల బారిన పడి సంక్షేమ బోర్డుకి అప్లై చేసుకొనని కార్మికులకు కూడా ఇప్పుడు అవకాశం కల్పించాలి

అట్లాగే ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుడికి తక్షణమే పది లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ప్రకటించాలి

50 సంవత్సరాలు దాటిన కార్మికుడికి సంక్షేమ బోర్డు నుండే వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలి సంక్షేమ బోర్డులో చేరిన కార్మికుడు జీవితకాలం బోర్డులో సభ్యుడిగా కొనసాగాలి

**సబ్సిడీపై కార్మికులకు లోన్లు ఇవ్వాలి**

సంక్షేమ బోర్డు నుండి కార్మికుడికి ఇచ్చిన కార్డుకు డిజిటల్ హెూదా కల్పిస్తూకార్మికుల కుటుంబాలకు ఈఎస్ఐ సౌకర్యం అందించాలిబీహార్ తరహాలో సంక్షేమ బోర్డు నుండి భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లో చదువుకున్న పిల్లలకు ఎల్కేజీ నుండి పీజీ వరకు స్కాలర్షిప్ అమలు చేయాలని కోరుతూ బిల్డింగ్ కన్ స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది

# భర్తను చంపిన భార్య కామేశ్వరి.సుధాకర్ లను అరెస్ట్ చేసిన పోలీసులు



ఐరాల, ఫిబ్రవరి 13 స్వర్ణ సాగరం

అక్రమ సంబంధం పెట్టుకుని భర్తని హతమార్చి భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేసిన భార్య కామేశ్వరి అతని అనుచరుడు సుధాకర్ని గురువారం ఐరాల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు.పోలీస్ కథనం మేరకు పూర్తి వివరాలు.ఐరాల మండలం నయనం పల్లెకు చెందిన రెడ్డప్ప భార్య కామేశ్వరి తన భర్త.రెడ్డప్ప కనిపించలేదని 2023 సంవత్సరం జనవరి 7వ తేదీన ఐరాల పోలీస్ స్టేషన్ లో కామేశ్వరిఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు శశి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా రెడ్డప్ప భార్య కామేశ్వరికి ఐరాల మండలం కంచంవారిండ్లు గ్రామానికి చెందిన కెసుధాకర్ అతనితో గత కొంత కాలం నుండి అక్రమ సంబంధం వుండటంతో రెడ్డప్పను ఎలాగైనా తొలగించుకోవాలని ఇద్దరు కలిసి పగడ్బందీగా ప్లాన్ వేసి చంపినారని ప్రాథమిక సమాచారం మేరకు కామేశ్వరుని సుధాకర్ని అదుపులోనికి తీసుకొని విచారించగా తమ అక్రమ సంబంధంకు కామేశ్వరి భర్త రెడ్డప్ప అడ్డుగా వున్నాడని రెడ్డప్పను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని వీరిరువురు పథకం ప్రకారం రెడ్డప్పను 2022వ సంవత్సరం నవంబర్ 17వ తేదీ రాత్రి మృతుడు రెడ్డప్ప ఇంటి వద్దనే రెడ్డప్పను కామేశ్వరి సుధాకర్ ఇరువురు కలిసి ఒక బండరాయితో అతని తల పైన బలంగా కొట్టి చంపేశారు ఎవ్వరికి అనుమానం రాకుండా ఉండాలనే ఉద్దేశంతో రెడ్డప్ప మృతదేహాన్ని ఊరికి సుమారు ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న పాడుబడిన బావి దగ్గరకు తీసుకొని వెళ్లి ఒక నల్లని ప్లాస్టిక్ తార్పాల్ పట్టను శవంకు చుట్టి అందులోనే కొన్ని బండ రాళ్లు వేసి దానిని ఒక తాడుతో కట్టి బావిలో వేసేశారు. దీనిపై ఐరాల ఎస్సై నరసింహులు. పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ విచారించగా రెడ్డెప్పను మేమే చంపేసినట్లు రెడ్డప్ప భార్య కామేశ్వరి సుధాకర్లు పోలీసు ఎదుట ఒప్పుకున్నారు దీంతో గురువారం ఐరాల తాసిల్దార్ మహేష్ కుమార్ సమక్షంలో శవపంచనామాను చేసి పోస్ట్ మార్టం చేయడం జరిగినది ముద్దాయిలను అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించారు.

# వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులకు ఆశీస్సులు అందజేసిన పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్



ఐరాల ఫిబ్రవరి 13 స్వర్ణ సాగరం

ఐరాల మండలం, పి.యల్లంపల్లె గ్రామానికి చెందిన విజయ కుమారి, పి.ఎల్.బాబు నాయుడు దంపతుల కుమా రుడు రాహుల్ వివాహ వేడుకలకు పూతల పట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ మరియు చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని ముఖ్య అతి థులుగా హాజరయ్యారు. గురువారం రాత్రి మురకంబట్టులో గల సాయి కన్వెన్షన్ హాల్ లో జరిగిన రాహుల్ మరియు శృతి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ నిండు మనస్సుతో అక్షింతలు వేసి ఆశీర్వదించి, వధూవరులకు వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. నిండు నూరేళ్ళు పాటు సుఖసంతోషాలతో, ఆనందమయ జీవితాన్ని గడపాలని ఆయన వధూవరులను ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఐరాల మండల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గిరిధర్ బాబు మరియు మండల నాయకులు పాల్గొన్నారు.

# రైతులకు వ్యవసాయ అధికారి గౌరీ విజ్ఞప్తి

వరదయ్యపాలెం స్వర్ణ సాగరం ఫిబ్రవరి 13



వరదయ్యపాలెం మండలంలోని రైతులందరూ విశిష్ట గుర్తింపు కార్డు కోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి గౌరీ తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రంలోని ప్రతి రైతుకి ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వనున్నామని, రైతులు తమ ఆధార్ నెంబర్, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డుతో లింక్ అయిన ఫోన్ నెంబర్ వివరాలు రైతు సేవ కేంద్రంలో ఉన్న సిబ్బందికి ఇచ్చి నమోదు చేసుకోవాలని , ఈ ప్రక్రియ పూర్తి అయిన తరువాత ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య పొందవచ్చుని,.ఈనెల 28వ తేదీ లోపు ప్రతి రైతు నమోదు చేసుకోవాలని, ఈ గుర్తింపు నెంబర్ ఉంటేనే పంట బీమా, పీఎం కిసాన్, పంట నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్రాలపై రాయితీలు ఇతర ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు

# నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా







## ఎస్పీ ఏ ఆర్ దామోదర్

కనిగిరి స్వర్ణ సాగరం, ఫిబ్రవరి 13:

జిల్లాలో నేరాలను నియంత్రించే చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా నేరాలు నియంత్రణ,అసాంఘిక కార్యకలాపాలపై మారుమూల ప్రాంతాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై నిఘా పెట్టేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. కనిగిరి పట్టణ గ్రానైట్ ప్యాక్టరీల ప్రెసిడెంట్ ముచ్చుమర్రి చెంచు రెడ్డి ఫ్యాక్టరీ సభ్యుల ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ కి అత్యాధునిక సాంకేతికత కూడిన ఒక డ్రోన్ కెమెరాను అందచేసినారు. జిల్లా పోలీస్ శాఖకు సామాజిక బాధ్యత, సేవా స్పూర్తితో పోలీస్ శాఖకు ఒక డ్రోన్ ను బహూకరించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ పోలీస్ శాఖ తరుపున వారికి కృతజ్ఞతలు తెలుపుతూ డ్రోన్ కెమెరాను కనిగిరి సీఐకి జిల్లా ఎస్పీ అందచేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీని వినియోగించి, నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా ప్రతీ పోలీసు స్టేషను పరిధిలో చైన్ స్నాచింగ్స్, ఈవ్ టీజింగు, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ఏరియాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాలు, ఇతర నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు నిశిత ప్రాంతాలను, తోటలు, బహిరంగ ప్రదేశాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. వివిధ విఐపిల బందోబస్తులలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయలు జరగకుండా డ్రోన్ కెమెరాలను ఉపయోగించడం జరుగు తుందని, ముఖ్య కూడళ్ళలో ట్రాఫిక్ నియంత్రణ, సుదూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టేందుకు డ్రోన్స్ వినియోగిస్తున్నట్లు చెప్పారు. డ్రోన్స్ వినియోగంపై పోలీస్ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, కనిగిరి సిఐ ఖాజావళీ, హెచ్ఎం పాడు ఎస్సై మాధవరావు, పీసీపల్లి ఎస్సై కోటయ్య, పాల్గొన్నారు.

# పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు

### తాడిమర్రి మండలంలో పలువురు నేతలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక
### పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్న శ్రీరామ్

ధర్మవరం స్వర్ణ సాగరం, ఫిబ్రవరి 13:

ధర్మవరం నియోజకవర్గంలో వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో పని చేసేందుకు పలువురు ముందుకొస్తున్నారు. తాజాగా తాడిమర్రి మండలం మరవపల్లి గ్రామానికి చెందిన పలువురు శ్రీరామ్ సమక్షంలో టీడీపీలో చేరారు. కిషోర్, లక్ష్మి నారాయణ అధ్వరంలో వైసీపీ పార్టీ కి చెందిన 30 కుటుంబాలవారు అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో టీడీపీలో చేరారు. వీరందరికీ శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధితో పాటు పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో పని చేయాలన్న ఉద్దేశ్యంతో పార్టీలో చేరినట్లు చెప్పారు. ఈ సందర్భంగా శ్రీరా మ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేడు అధికారంలో ఉన్న ఎన్.డి.ఏ ప్రభుత్వ ము ఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్రాష్ట్రం అభివృద్ధి వైపు నడుస్తోందన్నారు. అందుకే అంతా తెలు గుదేశం పార్టీతో కలిసి పని చేసేందుకు ముందుకొస్తున్నారని అన్నారు.



# చినగురవయ్య అకాలమరణం బాధాకరం



## మాజీ ఎమ్మెల్యే కదిరిబాబురావు

సి యస్ పురం, స్వర్ణసాగరం, ఫిబ్రవరి 13:

సిఎస్ పురం మండలంలోని డిజిపేట పంచాయతీ కిష్టంనాయునిపల్లె గ్రామానికి చెందిన మండల తెలుగురైతు అధ్యక్షుడు తులాబందుల చినగురవయ్య అకాలమరణం బాధాకరమని కనిగిరి మాజీఎమ్మెల్యే కదిరిబాబురావు అన్నారు. గురువారం చినగురవయ్య పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కదిరి మాట్లాడుతూ రాజకీయంగా తనవెన్నంటి ఉండి సలహాలు సూచనలు చేసి ఎమ్మెల్యేగా తనవిజయానికి కృషిచేశారని కొనియాడారు. అదేవిధంగా మండలంలోని శీలంవారిపల్లె గ్రామానికి చెందిన శానంరవణయ్య, ఆనికాళ్ళపల్లె గ్రామానికి చెందిన కామిరెడ్డి చినవెంకటరెడ్డి అకాల మరణం చెందగా వారి భౌతికాయలను సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు.

# అర్హులైన దివ్యాంగులకు సదరం ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి

## చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి స్వర్ణ సాగరం, ఫిబ్రవరి 13:



అర్హులైన దివ్యాంగులకు సదరం ధ్రువీకరణ పత్రాలు పునఃపరిశీలన చేసి అనర్హులపై ప్రభుత్వపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. గురువారం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలో దివ్యాంగుల వికలత్వ పెన్షన్ పొందుతున్న వారికి సదరం పునఃపరిశీలనలో భాగంగా కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పాల్గొని దివ్యాంగుల సమస్యలను ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు. తద్వారా దివ్యాంగులకు కే ఎస్ ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగత్వం కలిగిన ప్రతి ఒక్కరికి సదరం ధ్రువీకరణ పత్రాలు అవసరమన్నారు. సదరం ధ్రువీకరణ పత్రాలు పునః పరిశీలన చేయించుకోకపోతే పింఛన్లను తొలగిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. వివిధ కేటగిరీల కింద పెన్షన్ పొందుతున్న దివ్యాంగులు అష్ట కష్టాలు పడుతున్నారు. వెరిఫికేషన్ సక్రమంగా నిర్వర్తించాలని డాక్టర్స్ కు అయన చూచించ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల సూపర్డెంట్ డాక్టర్ సుబ్బయ్య సదరం వైద్య నిపుణులు డాక్టర్ ఆంజనేయులు డాక్టర్ తిరుపతి రెడ్డి మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బొట్టు శ్రీనివాసులు మాజీ సింగల్ విండో అధ్యక్షులు షైక్ బుడే సాహెబ్ వైద్య అధికారులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేజీవీబీ పాఠశాలలో భేటీ బచావో, బేటి ఫఢావో కార్యక్రమం

## ప్రకాశం జిల్లా హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ అడ్వైసర్ ముత్యాల నరేష్ రెడ్డి

సి యస్ పురం, స్వర్ణసాగరం, ఫిబ్రవరి 13.



సిఎస్పురం పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రెసిడెంట్ కే తిరుపాలు ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ అడ్వైసర్ ముత్యాల నరేష్ రెడ్డి బేటి బచావో, బేటి ఫడావో, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బేటి బచావో, బేటి ఫడావో, కార్యక్రమమును కేంద్ర ప్రభుత్వము అత్యంత ప్రభావంతమైన సామాజిక కార్యక్రమాల్లో పేరుగాంచిందని ప్రారంభించి జనవరి 1 నాటికి పది సంవత్సరాలు పూర్తి అయిందని తెలిపారు ప్రతి ఆడపిల్ల చదవాలి అప్పుడే సమాజము ఉన్నత స్థానములో ఉంటుందని, అలాగే శిశులింగ నిష్పత్తి పెంచాలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు బాల్య వివాహాలను అరికట్టాలని బాల బాలికలు ఇద్దరు సమానమేనని ఎవరిపై వివక్ష చూప వద్దని ఆడపిల్లలకు విద్య ఉద్యోగ అవకాశాలు ఉండేలా చూసేందుకే ప్రభుత్వము ఈ కార్యక్రమమును ఏర్పాటు చేసిందని తెలిపారు. భేటీ ఫడావో, బేటి బచావో ప్రసారం కింద ప్రభుత్వము సుకన్య సమృద్ధి యోజన పొదుపు పథకమును ప్రారంభించిందని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల లో బోధిస్తున్న మహిళా టీచర్స్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సూర్య ఫ్యామిలీ రెస్టారెంట్ ను సందర్శించిన వైసీపీ ఇంచార్జి దద్దాల



పామూరు స్వర్ణ సాగరం, ఫిబ్రవరి 13:

పామూరు మండలం బోట్లగూడూరు ఎంపీటీసి పోలినేని శ్రీనివాసులు గారు ఇటీవల నూతంగా సూర్య ఫ్యామిలీ రెస్టారెంట్ వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ను ప్రారంభించి వ్యాపారం వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి, గట్లా విజయభాస్కర్ రెడ్డి, అంబటి కొండారెడ్డి, మాజీ ఏ ఎం సీ వైస్ చైర్మన్ షైక్ చాంద్ బాషా, మైనారిటీ సెల్ అధ్యక్షులు షైక్ గయాజ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రీరామ శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి గాంఢ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు వాకమళ్ల రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం
ఒంగోలు గుంటూరు శ్రీసత్యసాయి
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9966555303

# మాలపాటి కొండలరావు కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం చేసిన వైసీపీ ఇంచార్జి దద్దాల



పిసిపల్లి స్వర్ణ సాగరం, ఫిబ్రవరి 13:

పిసిపల్లి మండలం మురిగుమ్మి పంచాయతీ మాలపాటి లక్ష్మీ కుమారి భర్త మాలపాటి కొండలరావు ఇటీవల అనారోగ్యం కారణంగా మరణించిన విషయం తెలుసుకొని గురువారం వారి కుటుంబాన్ని పరామర్శించి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకుని ఆ కుటుంబానికి అండగా ఆయన భార్య లక్ష్మీ కుమారికి కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ రూ. 20000 సర్పంచ్ నల్లగంగుల సుబ్బ రత్తమ్మ, రూ.30000 సీనియర్ నాయకులు చీమల పెద్ద బ్రహ్మారెడ్డి రూ.10000 ఆర్థిక సహాయం చేసి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుంది అని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పెద్దిరెడ్డి ఓకే రెడ్డి,మండల కన్వీనర్ గోపవరపు బోర్రా రెడ్డి,సోషల్ మీడియా కో కన్వీనర్ నల్లగంగుల శ్రీను,వళ్లెం మాల్యాద్రి, మోహన్ రెడ్డి, వళ్లెం రమణారెడ్డి, సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి.

## ఎం.ఎస్.రాజు, ఎమ్మెల్యే మరియు గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్సీ

మడకశిర స్వర్ణ సాగరం ఫిబ్రవరి 13



ఈనెల 15వ తేదీన శనివారం ఉదయం 10.00 గంటలకు మడకశిర పట్టణంలోని మధుగిరి రోడ్డులో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయము నందు నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను మడకశిర నియోజకవర్గ నిరుద్యోగ యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకొని జీవితంలో స్థిరపడాలని మడకశిర శాసనసభ్యులు ఎంఎస్ రాజు మరియు మాజీ శాసనమండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి పత్రిక ముఖంగా తెలియజేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 50కు పైగా కార్పొరేట్ కంపెనీల వారు మడకశిరకే వచ్చి నిరుద్యోగ విద్యావంతులను ఎంపిక చేసుకోనున్న నేపథ్యంలో ప్రజలందరూ నియోజకవర్గంలోని యువతి, యువకులకు తెలియజేసి సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలని కోరడం జరిగింది.

# అయ్యలూరివారిపల్లి గ్రామంలో భజన సామూహిక హారతి కార్యక్రమం



సి యస్ పురం, స్వర్ణసాగరం, ఫిబ్రవరి 13:

సి యస్ పురం మండలం అయ్యలూరి వారిపల్లి గ్రామంలోని రామాలయం దగ్గర మాఘ పౌర్ణమి సందర్భంగా భజన సామూహిక హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 55 ధర్మనిధి సభ్యత్వాలు చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా సహ కన్వీనర్ యం.గోవర్ధని , మండల కమిటీ సభ్యులు నేలటూరి రమణారెడ్డి, గ్రామ ధార్మిక సమితి సభ్యులు, గ్రామస్తులు ఖండ ధర్మప్రచారక్ యం.అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కార్యకర్తలకు పోషణ్ భీ, పఢాయి భీ శిక్షణ కార్యక్రమం

నాగలాపురం -స్వర్ణ సాగరం,ఫిబ్రవరి 13:



నాగలాపురం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్లో పిచ్చాటూరు ఐసిడిఎస్ సిడిపిఓ శోభారాణి ఆద్వర్యం లో అంగన్వాడి కార్యకర్తలు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అంగన్వాడి కార్యలర్తలకు శిక్షణ కార్యక్రమంలో మొదటి రోజు బాగంగా బాల్య,విద్య యొక్క ప్రాముఖ్యత,పిల్లల ఆకాంక్షలను అర్థం చేసుకోవడానికి సమూహ కార్యకలపాలు,పోషన్ భీ పడాయి భీ కోసం హేతుబద్దీకరణ వంటి అంశాల గురించి వివరించారు.ఈ కర్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైసర్ శ్రీదేవి, అంగన్వాడి కార్యకర్తలు,పాల్గొన్నారు.

# కార్యకర్తను పరామర్శించి రూ.20000 ఆర్థిక సహాయం



వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్

**పామూరు స్వర్ణ సాగరం, ఫిబ్రవరి 13:**

పామూరు పట్టణానికి చెందిన వైసీపీ కార్యకర్త షైక్ రసూల్ కిడ్నీ లివర్ సమస్యలతో బాధపడుతున్న విషయం తెలుసుకొని గురువారం వారి ఇంటికి వెళ్లి అతనిని పరామర్శించి రూ. 20000 ఆర్థిక సహాయం కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ చేసి మంచి మనసు చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం తన ఆరోగ్య పరిస్థితుల గురించి అతని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ గంగసాని లక్ష్మీ హుస్సేన్ రెడ్డి, వైస్ సర్పంచ్ యాదల సాయి కిరణ్, సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి, గట్లా విజయభాస్కర్ రెడ్డి, అంబటి కొండారెడ్డి, మాజీ ఏ ఎం సీ వైస్ చైర్మన్ షైక్ చాంద్ బాషా, మైనారిటీ సెల్ అధ్యక్షులు షైక్ గయాజ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రీరామ శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు వాకమల్ల రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి పాల్గొన్నారు.

# గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పి రమ



**గుడిబండ స్వర్ణ సాగరం ఫిబ్రవరి 13**

మండలం కేంద్రంలోని గ్రంథాలయని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పి రమ ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది. తర్వాత గుడిబండ శాఖ గ్రంథాలయానికి రావలసిన సెస్సు బకాయిలను గురించి కృషి చేయవలసినదిగా తెలపడం జరిగింది. పాఠకులు గ్రంథాలయానికి వచ్చేటట్టుగా కృషి చేయాలి అని తెలిపినారు. రాబోయే ఉద్యోగ నోటిఫికేషన్ లకు సంబంధించిన సమాచారాన్ని పాఠకులకు తెలిపి వారి ఉద్యోగ సాధనకు మార్గదర్శకులు కావాలని తెలిపినారు. ఈ కార్యక్రమంలో గుడిబండ శాఖ గ్రంథాలయ అధికారి సి ఇబ్రహీం గ్రంథాలయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# నేడు దామోదరం సంజీవయ్య జయంతి మహోత్సవ కార్యక్రమం

**ఒంగోలు, స్వర్ణ సాగరం, ఫిబ్రవరి 13:**

శ్రీ దామోదరం సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి మరియు తొలి దళిత ముఖ్యమంత్రి 105 వ జయంతి మహోత్సవము పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 న ప్రతి జిల్లాలో జయంతి మహోత్సవము నిర్వహించాలని ఆదేశించటమైనదని డిడి ఎన్. లక్ష్యా నాయక్ తెలిపారు. కావున ప్రకాశం జిల్లాలో కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ ప్రకాశం జిల్లా, వారి ఆధ్వర్యంలో ఈనెల 14 న శ్రీ దామోదరం సంజీవయ్య 105 వ జయంతి మహోత్సవము నిర్వహించబడుతుంది. ఈ జయంతి మహోత్సవ కార్యక్రమము ఉదయం 10.30 లకు ఒంగోలు లోని ప్రకాశం భవనం ఎదురుగా శ్రీదామోదరం సంజీవయ్య కాంస్య విగ్రహమునకు పుష్ప మాలంకరణ కార్యక్రమము నిర్వహించబడును. ఈ కార్యక్రమములో సాంఘిక సంక్షేమ శాఖ, విభిన్న ప్రతిభావంతుల మరియు వయోవృద్ధుల సంక్షేమ సచివాలయముల మరియు వాలంటీర్ల శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి , జిల్లా లోని పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, మండలి సభ్యులు, జిల్లా పరిషత్ చైర్మన్, ఒంగోలు మేయర్ మరియు కార్పొరేషన్ చైర్మన్స్ వారు పాల్గొంటారు. కావున, జిల్లాలోని అందరు ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, దళిత నాయకులు, ప్రజలు మరియు మీడియామిత్రులు ఈనెల 14న జరుగు శ్రీదామోదరం సంజీవయ్య 105 జయంతి మనోత్సవసభకు విచ్చేసి జయప్రదం చేయవలసినదిగా పత్రికా ముఖముగా తెలిపినారు.

# దొనపాటి వారి వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



**సి యస్ పురం, స్వర్ణసాగరం, ఫిబ్రవరి 13:**

కొవిలంపాడు గ్రామానికి చెందిన దొనపాటి చెన్నారెడ్డి కుమారుడు నవీన్ కుమార్ రెడ్డి,యోగిత రెడ్డి ల వివాహ వేడుక బుధవారం రాత్రి జరిగింది. ఈ వివాహ వేడుక లో కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోవిలంపాడు ఎంపీటీసీ గోను సరస్వతి వెంకటేశ్వర రెడ్డి, జిల్లెల్ల లక్ష్మీనారాయణ, కోవిలంపాడు ఉప సర్పంచ్ తీకెనం బాబురావు, మాజీ ఎంపిటిసి వెంకటనారాయణ, కందుల శ్రీనివాసులు రెడ్డి, దుగ్గిరెడ్డి వెంగళ్ రెడ్డి, గోను శ్రీనివాసులు రెడ్డి, పట్నం తిరుపతయ్య ముత్యాల నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మనోజ్ఞ విజయం రాష్ట్రానికే గర్వకారణం

**మంత్రి నారా లోకేష్**

**కష్టానికి ప్రత్యామ్నయం లేదు**

**జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే కష్టపడాల్సిందే**

**జేఈఈ టాపర్ మనోజ్ఞను అభినందించిన మంత్రి లోకేష్**

**స్వర్ణ సాగరం, ఫిబ్రవరి 13:**

జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి కష్టపడటం ఒక్కటే మార్గం, ఎటువంటి దగ్గర దారులు ఉండవని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. జేఈఈ (మెయిన్స్) – లో నూటికి నూరుశాతం మార్కులు సాధించిన గుత్తికొండ మనోజ్ఞను మంత్రి లోకేష్ అభినందించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచావు, మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఏ అవసరం ఉన్న ఒక్క మెసేజ్ పెట్టు అన్నగా అండగాఉంటానని ఫోన్ నెంబర్ ఇచ్చారు. ప్రతి బిడ్డ విజయంలో తల్లిపాత్ర ఏంటో నాకు తెలుసు అంటూ ఆమె తల్లిని కూడా లోకేష్ సత్కరించారు. మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న మనోజ్ఞ తండ్రితో కరి కులం ప్రక్షాళనపై చర్చించారు. ఇండస్ట్రీకి అవసరమైన కరికు లం ఉండాలనేది నా ఆలోచన, జాబ్ రెడీ యూత్ ని తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఉద్యోగాలు కల్పించడమే కాకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి యువతను ప్రోత్సహించాలనేది నా ధ్యేయమని అన్నారు. కేజీ టు పీజీ విద్యలో చేస్తున్న మార్పుల గురించి వివరించారు. నాలుగేళ్ల ఇంజనీరింగ్ చదివి సాధించలేని ఉద్యోగం నాలుగు నెలలు అమీర్ పేట లో కోర్స్ చేసి ఎలా సాధిస్తున్నారనేది నా ప్రశ్న. విద్యార్థి కాలేజీ నుంచి బయటకు రాగానే ఉద్యోగం సాధించేలా తయారు కావాలన్నది తన ఆకాంక్షగా మంత్రి లోకేష్ పేర్కొన్నారు.



# పండుగలా సంఘ సేవకులు డాక్టర్ కోటేశ్వరబాబు జన్మదిన వేడుకలు

**ఢిల్లీ నుంచి ఫోన్ ద్వారా ఎమ్మెల్యే బొజ్జల**

**సుధీర్ రెడ్డి శుభాకాంక్షలు**

**బొజ్జల రిషితారెడ్డి ఆశీర్వాదం**

**బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అభినందన**

**కలం వీరునికి వెల్లువెత్తిన అభిమానం**

**పలుచోట్ల కేక్ కట్టింగ్ లు - అన్నదానం**

**రోగులకు పాలు పండ్లు, మహిళలకు చీరల పంపిణీ**

**తుఫాన్ సెంటర్ లో విద్యార్థులకు విద్యాసామగ్రీ పంపిణీ**



**శ్రీకాళహస్తి, స్వర్ణసాగరం :**

పేదలంటే ప్రాణమిచ్చే.. మన్ను మిన్ను కన్న గొప్ప మనస్సున్న దానవీరశూరకర్ణుడు. మట్టి నుంచి పుట్టి పెరిగి కట్టుబట్టలుంటే చాలు అని సాటివారి సేవకై పరితపిస్తూ పేదోళ్ల బతుకుల్లో పండుగయ్యారు. చదువులమ్మ గురువుగా సేవలందించారు. తన సేవా కార్యక్రమాలతో ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపిన ప్రముఖ సంఘ సేవకులు, ఆంధ్రశ్రీ అవార్డు గ్రహీత, ఎపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ యల్లంపాటి కోటేశ్వర బాబు జన్మదిన వేడుకలు బుధవారం పట్టణంలో పండుగ వాతావరణంలో జరిగాయి. అభిమానులు, మిత్ర బృందం, శేయోభిలాషులు, అధికారులు, రాజకీయ ప్రముఖులు, పాత్రికేయ మిత్రులు, కార్మిక వర్గం తదితరుల నుంచి అభిమానం వెల్లువెత్తింది. తొలుత తల్లి స్వగ్రమం గోపాలకృష్ణ పురం వీరమ్మ ఆశీస్సులు తీసుకుని స్వగృహం నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయం చేరుకుని ఆ ముక్కంటి ఆశీస్సులు తీసుకున్నారు. తర్వాత పలుచోట్ల ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని భర్తడే కేక్ లను కట్ చేశారు.

**ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రత్యేక అభినందన..** శ్రీకాళహస్తీశ్వరుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పలువురిని ఆహ్వానించడానికి దేశ రాజధాని ఢిల్లీలో తీరికలేకుండా ఉన్నప్పటికీ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కలం వీరుడు కోటేశ్వర బాబుకు ఫోన్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలి పారు. ప్రత్యేకంగా కోటిబాబు చేస్తున్న సేవలను అభినందించారు.

**బీజేపీ నేత కోలా ఆనంద్ విషెస్...** బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ తన హృదయ పూర్వక శుభాకాంక్షలు కోటి బాబుకు తెలిపారు. మంచి విలువలతో కూడిన జర్నలిజం చేస్తూ సంఘ సేవకునిగా మరింతగా సేవలు అందించాలని ప్రత్యేకంగా అభినందించారు.

**లక్కమనేని ఆధ్వర్యంలో సంబరం...** తెలు గుదేశం పార్టీ నాయకులు లక్కమనే మధుబాబు ఆధ్వర్యంలో బత్తయ్య నాయుడు ఆసుపత్రి ఎదురువీధిలోని ఆయన కార్యాలయం వద్ద కోటి బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి భారీ కేక్ కటింగ్ చేసి భారీ సంఖ్యలో హాజరైన అభిమానులకు విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరబాబును ఆశీర్వదించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి కొట్టే సాయి , టిడిపి మైనార్టీ రాష్ట్ర నేత షాకీర్ ఆలీ, టిడిపి గిరిజన నేత సుబ్బయ్య, టిడిపి నేత నెమలూరు బుజ్జి, శ్రీకాళహస్తి జడ్పిటిసి కాపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి,తొట్టంబేడు, ఏర్పేడు మండలాల మాజీ జడ్పీటీసీ సభ్యులు, బిజెపి నాయకులు, పాల్గొని శుభాకాంక్షలు చెప్పారు. అంతకు ముందు పేద మహిళలకు చీరలను పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి అందరి ఆశీస్సులు అందుకున్నారు.

**కోటేశ్వరబాబు జన్మదినం సందర్భంగా ఉదయం నుంచి జరిగిన కార్యక్రమాల వివరాలు వరుసగా ఇలావున్నాయి...**

శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో పాత్రికేయ మిత్రుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కేక్ కట్టింగ్ చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయుల కోటేశ్వరబాబును ఘనంగా శాలువ, పూలమాలలో సత్కరించారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విద్యాదానం చేసిన గురువు కోసం శిష్యుడు పసుపులేటి పురుషోత్తం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. రోగులు, వారి సహాయకులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ. శ్రీకాళహస్తి పూసలవీధి కోనేరు(వైష్ణవ పుష్కరిణి) సమీపంలోని ఈశ్వరయ్య కాలనీలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అంతకు ముందు ఇక్కడకు చేరుకున్న కోటేశ్వరబాబుకు స్థానికుల నుంచి ఘన స్వాగతం లభించింది. శాలువతో ఘనంగా సత్కరించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని వెంకటగిరి బస్టాండు సమీపంలో మిత్రుడు సాలాపక్షి నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు ఐదొందల మందికిపైగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరబాబును ఘనంగా సత్కరించారు. ఆటో యూనియన్ కార్మికులు పెద్దయెత్తున ఇక్కడ ఆయనకు స్వాగతం పలికారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో మిత్రుడు కేశవ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కోటేశ్వర బాబు పాల్గొన్నారు. కేక్ కట్టింగ్ చేసి అందరికీ పంచిపెట్టారు. అలాగే రాజీవ్ నగర్ కాలనీలో పూర్వ విద్యార్థి అనిల్ కుమార్ రెడ్డి జరిగిన వేడుకల్లోనూ పాల్గొన్నారు. ఈ రెండు చోట్ల మిత్ర బృందం ఆధ్వర్యంలో ఘన సత్కారం చేశారు. శ్రీకాళహస్తి పట్టణం తుఫాన్ సెంటర్ లోని అల్లిమడుగు ప్రభుత్వ పాఠశాలలో తన జన్మదినాన్ని పురస్కరించుకుని కోటేశ్వరబాబు 70 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సీళ్లు వంటి విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు లక్కమనేని మధుబాబు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు అత్యంత సంబరంగా జరిగాయి. పీఎన్ రోడ్డులో బత్తయ్య నాయుడు ఆసుపత్రి ఎదురు వీధిలోని మధుబాబు కార్యాలయం వద్ద ఈ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి పాల్గొన్నారు. కోటేశ్వరబాబును ఆశీర్వదించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భారీ కేక్ ను కట్ చేశారు. అనంతరం పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, మిత్రులు, శేయోభిలాషులు తదితరులు కోటేశ్వరబాబును ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకాళహస్తిలోనే కాక పలు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, రాజకీయ ప్రముఖులు, జర్నలిస్టు ప్రముఖులు, సుప్రిం, హైకోర్టుకు చెందిన పలువురు ప్రముఖ న్యాయవాదులు, రాష్ట్రంలోని అధికార ప్రముఖులు, చలనచిత్ర ప్రముఖ నటులు కోటేశ్వరబాబుకు చరవాణి ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మొత్తంగా ఒక పండుగ వాతావరణంలో మాఘ పౌర్ణమి శుభదినాన కోటి బాబు జన్మదిన వేడుకలు ఉదయం 5 గంటలకు ప్రారంభమై రాత్రి 11 గంటల వరకు అత్యంత సంబరంగా వెల్లువెత్తిన అభిమానంతో జరిగాయి...









# మా పాలిట దేవదూత.. ఇక మాటల్లో చెప్పలేను



మెగాస్టార్ చిరంజీవి తనకు, తన కుటుంబానికి దైవంతో సమానం అని చెబుతోంది హీరోయిన్ ఊర్వశీ రౌతెల ఆయన మాకు ఏమీ కారు.. సినిమాలో నటించిన చిన్న పరిచయం అంతే. కానీ కష్టంలో ఎంతో అండగా నిలిచారు. అందుకే ఆయన్ను దైవంలా భావిస్తున్నామని, తమ బలానికి ఆయనొక లైట్‌హౌస్ లాంటివారని అంటోంది ఊర్వశీ. ఇంతకీ ఏం జరిగిందంటే.. ఇటీవల ఊర్వశీ తల్లి మీను రౌతెల ఆస్పత్రి పాలైంది. ఆమె ఎడమ కాలిలో ఎముకలో ఇంట్రా ఆర్టిక్యూలర్ ఫ్రాక్చర్ అయింది. అదెంతో ప్రమాదకరమని వైద్యులు చెప్పగా ఊర్వశీ చిరంజీవిని సహాయం కోరింది. అందుకు స్పందించిన చిరంజీవి కోల్‌కత్తా అపోలో ఆస్పత్రి బృందంతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చేశారు. డాక్టర్లు సర్జరీ చేయడంతో ఆమె ఆ సమస్య నుంచి గట్టెక్కింది. ఈ విషయమై తమ కుటుంబం చిరంజీవికి జీవిత కాలం రుణపడి ఉంటామని చెబుతోంది. ఆమె 'చిత్రజ్యోతి'తో మాట్లాడుతూ "చిరంజీవిగారి సేవా కార్యక్రమాల గురించి ఎంతో విన్నాను. 'వాల్తేరు వీరయ్య' సాంగ్ షూటింగ్‌లో నేను ఆయన్ను ఎంతో గమనించాను. ఆపద అన్నవారికి నేను చూస్తుండగానే ఎంతో సాయం అందించారు. ఆ సాయం నా వరకూ కూడా వచ్చింది. అమ్మ ఎడమ కాలి ఎముకకు పెద్ద సమస్యే వచ్చింది. ట్రీట్‌మెంట్ విషయంలో ఎక్కడా సరైన సమాధానం దొరకలేదు. అప్పుడు చిరంజీవిగారి సాయం కోరాను. ఎంతో మొహమాటంగా అడిగాను.

**కొండంత ధైర్యానిచ్చాయి**

నిర్భయంగా ఉండమని ధైర్యం చెప్పి, ఒక సంరక్షకుడిలా సమస్యకు సంబంధించిన అన్ని వివరాలు క్షుణ్ణంగా తెలుసుకున్నారు. కలకత్తాలోని అపోలో సిబ్బందితో మాట్లాడి మంచి వైద్యం అందేలా చేశారు. తదుపరి 'మీ అమ్మగారికి ఏమీ కాదు. ఆరోగ్యంగా ఉంటారు' అని ధైర్యం చెప్పారు. ఆ సమయంలో ఆయన మాటలు కొండంత ధైర్యానిచ్చాయి. మా కుటుంబానికి శ్వాస నిచ్చిన నిజమైన హీరోలా కనిపించారు. కష్టకాలంలో ఆయన చూపించిన ప్రేమ, అచంచలమైన మద్దతును మాటల్లో చెప్పలేను. భూమ్మీద ఇంకా మంచి, మానవత్వం బతికే ఉందని నిరూపించారు. అంత బిజీ షెడ్యూల్‌లోనూ ఆయన అండగా నిలిచారు. ఎప్పటికప్పుడు అప్‌డేట్ తీసుకున్నారు. ఏ అవసరం వచ్చిన అడగటానికి మొహమాటపడొద్దని పదేపదే చెప్పారు. ఆయన మా పాలిట సంరక్షకుడిగా, దేవదూతలాగా కనిపించారు. చిరంజీవి చేసిన సాయానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం" అంటూ ఊర్వశీ రౌతెల భావోద్వేగానికి లోనయ్యారు. చిరంజీవి హీరోగా నటించిన 'వాల్తేరు వీరయ్య చిత్రంలో 'వేర్ ఈజ్ ద పార్టీ బాసు' సాంగ్‌లో కనిపించి సందడి చేసారు.

# నాని.. డ్రీమ్ కాంబినేషన్ రెడీ?



టాలీవుడ్లో క్వాలిటీ సినిమాలు చేస్తూనే మంచి స్పీడ్ కూడా చూపించే హీరోల్లో నేచురల్ స్టార్ నాని పేరు ముందు వరుసలో ఉంటుంది. ఒకప్పుడు కేవలం క్లాస్ టచ్ ఉన్న సినిమాలే చేసిన నాని.. ఆ తర్వాత మాస్ సినిమాలు కూడా చేసి ఆ వర్గంలోనూ ఆదరణ సంపాదించుకున్నాడు. సినిమా సినిమాకూ తన మార్కెట్ కూడా విస్తరిస్తోంది. దసరా, హాయ్ నాన్న, 'సరిపోదా శనివారం' చిత్రాలతో హ్యాట్రిక్ కొట్టిన నాని.. ప్రస్తుతం 'హిట్–3' లాంటి క్రేజీ మూవీలో నాని నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. త్వరలోనే అతను 'దసరా' దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో 'ప్యారడజ్' మూవీని మొదలుపెట్టబోతున్నాడు. ఐతే ఓవైపు సినిమాలు చేస్తూనే.. మధ్య మధ్యలో కొత్త కథలు విని ఫ్యూచర్ ప్రాజెక్టులను కూడా లైన్లో పెడుతుంటాడు నాని. ఈ క్రమంలోనే అతను ఒక డ్రీమ్ కాంబినేషన్లో సినిమాకు రెడీ అయినట్లు వార్తలు వస్తున్నాయి. తెలుగులో అరుదైన దర్శకుల్లో ఒకడిగా పేరున్న శేఖర్ కమ్ములతో నాని జట్టు కట్టబోతున్నాడన్నది తాజా సమాచారం.నాని ఒకప్పటి ఫిల్మోగ్రఫీని పరిశీలిస్తే.. శేఖర్ కమ్ముల అతడికి బాగా సూటయ్యే దర్శకుడని చెప్పొచ్చు. వీరి కలయికలో సినిమా వస్తే బాగుంటుందని ఇరువురి అభిమానులూ కోరుకున్న వారే. కానీ ఎందుకో అది సాధ్యపడలేదు. ఎట్టకేలకు ఈ కాంబోలో సినిమాకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. నానిలా కమ్ముల స్పీడుగా సినిమాలు చేసే రకం కాదు. సినిమాకు సినిమాకు మధ్య చాలా గ్యాప్ ఉంటుంది.

## చరణ్ అభిమానుల్లో టైటిల్ టెన్షన్



పెద్ద హీరోల సినిమాలకు ఏ టైటిల్ పెట్టినా చెల్లుతుందనుకోవడం తప్పు. ఎంపికలో ఏ మాత్రం పొరపాటు చేసినా దాని ప్రభావం నేరుగా ఓపెనింగ్స్ మీద పడుతుంది. ఇటీవలే 'గేమ్ ఛేంజర్' పేరు మాస్ కి చేరలేక అప్పటికే తక్కువగా ఉన్న బజ్ ని మరింత కిందకు తీసుకెళ్లింది. ప్యాన్ ఇండియా కోసం ఇలా పెడుతున్నామని దర్శక నిర్మాతలు సమర్ధించుకోవచ్చు కానీ అన్ని వర్గాలకు అది కనెక్ట్ అయ్యేలా ఉందో లేదో చెక్ చేసుకోవడం అవసరం. రామ్ చరణ్ దర్శకుడు బుచ్చిబాబు కలయికలో తెరకెక్కుతున్న భారీ చిత్రానికి 'పవర్ క్రికెట్' పేరుని పరిశీలిస్తున్నట్టు వస్తున్న వార్త ఫ్యాన్స్ ని ఆందోళనకు గురి చేస్తున్నాయి.ఎందుకంటే ఈ టైటిల్ వినగానే ఏదో టీవీ రియాలిటీ షోలా అనిపిస్తోంది కానీ రామ్ చరణ్ లాంటి స్టార్ హీరో మూవీలా కాదనేది వాళ్ళ అభిప్రాయం. దీని కన్నా ఎప్పుడో ప్రచారంలోకి వచ్చిన 'పెద్ది'నే బెస్ట్ అంటున్నారు. అయితే అన్ని భాషల్లో ఒకే టైటిల్ ఉండేలా చూసుకోవడం పెద్ద సవాల్ గా మారింది. పెద్ది అంటే తెలుగు వాళ్లకు అర్థమవుతుంది కానీ నార్త్ ఆడియన్స్ కన్ఫ్యూజ్ అవుతారు.

## ప్రభాస్‌తో కలిసి నటించాలనుకుంటున్నారా?.. ఇదే గోల్డెన్ చాన్స్!



ప్రభాస్ ని చూస్తే చాలు అనుకునేవాళ్లు చాలా మంది ఉన్నారు. ఆయనతో ఒక సెల్ఫీ దిగితే చాలు..ఇంకేం వద్దు అనుకునే ఫ్యాన్స్ కూడా ఉన్నారు. అలాంటిది ప్రభాస్‌తో కలిసి నటించే చాన్స్ వస్తుందంటే.. ఎవరైనా ఊరుకుంటారా? అసలు అలాంటి అవకాశం వస్తుందని కూడా ఊహించరు కదా? ఇప్పుడు అలాంటి గొప్ప అవకాశాన్ని కల్పించేందుకు ముందుకు వచ్చింది 'స్పిరిట్' యూనిట్. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి 'యానిమల్'"ఫేం సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమా రెగ్యులర్ షూట్‌ను మార్చ్ లో ప్రారంభించాలని యూనిట్ ప్లాన్ చేస్తోందని సమాచారం. ప్రభాస్ తన కెరీర్ తొలిసారిగా పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్, ఆలియా భట్, రష్మికా మందన్నా..తదితర స్టార్ హీరోయిన్ ల పేర్లు తెరపైకి వస్తున్నాయి. అయితే.. వారితో ఎవరూ కూడా ఫైనలేజ్ కాలేదట. ఇదిలా ఉంటే.. ఈ సినిమా లో కలిసి నటించే సువార్ణావకాశాన్ని కల్పించింది నిర్మాణ సంస్థ భద్రకాళి పిక్చర్స్.'స్పిరిట్' కోసం నటీనటులు కావాలంటూ సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటన విడుదల చేసింది. వయసుతో సంబంధం లేకుండా ఆసక్తి ఉన్న పురుషులు, స్త్రీలు అంతా తమ ప్రొఫైల్ పంపించాల్సిందిగా కోరింది. అయితే ఇక్కడ ఓ చిన్న కండీషన్ కూడా పెట్టింది. గతంలో ఫిలిం లేదా థియేటర్ బ్యాగ్రౌండ్ ఉన్నవాళ్లు మాత్రమే ఇందుకు అర్హులని ప్రకటించింది.

అయితే ఇందుకు 2 ఫొటోలు, 2 నిమిషాల వీడియో రికార్డ్ చేసి.. spirit.bhadrakalipichtures@gmial.com పంపించాలని ప్రకటించారు. ఆసక్తి గలవారు ఓ వీడియో రికార్డ్ చేసి, ఈ ఈమెయిల్ కు పంపించాలని ప్రకటించారు. ఈ మేరకు 'కాస్టింగ్ కాల్' అంటూ సోషల్ మీడియాలో ఓ పోస్టర్ షేర్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్టు నెట్టింట్లో వైరల్ గా మారింది. కాగా, ప్రభాస్ ప్రస్తుతం ఫౌజీ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్ కీలక పాత్రలో కనిపించనున్నారు.ఈ సినిమా పూర్తి అయినా తరువాత 'స్పిరిట్'సినిమా షూటింగ్ లో పాల్గొన అవకాశముంది

# పవన్ కళ్యాణ్ దగ్గర చాలా నేర్చుకోవాలి




నిధీ అగర్వాల్ మంచి ఫామ్‌లో ఉన్నారు. సక్సెస్‌లు లేకపోయినా అవకాశాలు మాత్రం బాగానే వరిస్తున్నాయి. ఇప్పటికే ఆమె రెండు భారీ చిత్రాల్లో అగ్ర హీరోల సరసన నటిస్తోంది. ప్రస్తుతం 'హరిహర వీరమల్లు' 'ది రాజాసాబ్'తో ఈ ఏడాది ప్రేక్షకులకు వినోదాన్ని అందించనుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె తన అప్‌కమింగ్ సినిమాల గురించి మాట్లాడారు. 2022లో గ్యాప్ తీసుకోవడానికి గల కారణాన్ని వివరించారు. 'హరిహర వీరమల్లు' లో నా పాత్ర ఇప్పటివరకు నేను చేసిన వాటిల్లో అత్యుత్తమమైనది. ఆ పాత్ర కోసం గుర్రపు స్వారీ, క్లాసికల్ డ్యాన్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నా. కథక్ నేర్చుకున్నాను. నా కల నిజమైంది. అదృష్టవంతురాలిని అని అనిపించింది. అలాగే హర్రర్ సినిమాలంటే గతంలో భయం ఉండేది. అందుకే 'ది రాజా సాబ్' చేయాలనుకున్నాను. సెట్‌లో స్క్రిప్ట్ చదువుతున్నప్పుడు కూడా అందరం నవ్వుతూనే ఉన్నాం" అని అన్నారు. సెట్‌లో విషయానికొస్తే.. పవన్ కల్యాణ్, ప్రభాస్ నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. పవన్ సెట్స్‌లో ఉన్నప్పుడు ఎంతో ఏకాగ్రతతో ఉంటారు. యాక్షన్ చెప్పగానే పూర్తిగా పాత్రలోకి వెళ్లిపోతారు. చుట్టూ ఏం జరుగుతున్నా పట్టించుకోరు. ఆ సన్నివేశంపై మాత్రమే దృష్టిపెడతారు. ఈ లక్షణాన్ని నేను కూడా అలవాటు చేసుకోవాలి. ప్రభాస్ ఫన్నీ పర్సన్. ఈ రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు వస్తాయా అని ఆతురతగా ఎదురుచూస్తున్నా" అని అన్నారు. "నేను స్టార్ కిడ్‌ని కాదు. సినిమా నేపథ్యం లేని కుటుంబం నుంచి వచ్చాను. నేను నటిగా మొదటి స్థానంలో ఉండడమే పెద్ద విషయం. సినిమాల్లో అవకాశాలు రావడమే నాకు విజయంతో సమానం. ఎక్కువ సినిమాలు చేయాలని అందరికీ ఉంటుంది. కానీ, నేను మాత్రం నమ్మకం ఉన్న కథలనే ఎంచుకుంటాను. అలాంటి వాటిపైనే దృష్టి పెడతాను. వరుసగా కమర్షియల్ సినిమాలు చేయడానికి నేనేమీ హీరోను కాదు. ఒకవేళ నేను వరుస సినిమాలు చేసినా నన్ను అలాంటి స్క్రిప్ట్‌లు ఎంచుకున్నందుకు కామెంట్ చేస్తారు. అందుకే గొప్ప కథలను మాత్రమే ఎంచుకుంటున్నాను" అన్నారు.